PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 303 | విజయవాడ, సోమవారం 5 జూన్ 2023 | 6+ 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 5 June 2023 | Rs

మణిపూర్ హింసాకాండపై త్రిసభ్య కమిషన్
- ఛైర్‌పర్సన్‌గా జస్టిస్ అజయ్ లంబా
- 6 నెలల లోగా కేంద్రానికి నివేదిక

5



వరుణుడు కరుణిస్తేనే..!
- లండన్‌లో అనిశ్చిత వాతావరణం
- ఐసిసి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్

సిబిఐ దర్యాప్తు

ప్రమాదంపై రైల్వే బోర్డు సిఫార్సు

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే లూప్‌లైన్‌లోకి కోరమాండల్
- ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సమస్యే ప్రమాదానికి కారణం
- మృతులు 275
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



ప్రమాదం జరిగిన బహనగ బజార్ రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం కొనసాగుతున్న ట్రాక్ పునరుద్ధరణ పనులు

భువనేశ్వర్: ఒడిషాలో శుక్రవారం జరిగిన మూడు రైళ్ల ప్రమాదంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ ప్రమాదంపై విచారణను సిబిఐకి అప్పగించాలని రైల్వే బోర్డు చేసిన సిఫారసు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఆదివారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ, ట్రాక్‌ల మరమ్మతులు జరుగుతున్నాయని, బుధవారానికల్లా పట్టాలపై సాధారణ సర్వీసులను పునరుద్ధరించనున్నామని మంత్రి చెప్పారు. బాలాసోర్, కటక్, భువనేశ్వర్‌లలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్రం అన్ని విధాలా సాయం అందిస్తుందని మంత్రి చెప్పారు. టికెట్ తీసుకున్నారా లేదా అన్నదాంతో ప్రమేయం లేకుండా చనిపోయిన ప్రయాణీకులందరికీ ఎక్స్‌గ్రేషియో ఇస్తామన్నారు. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే శాఖ ప్రతినిధి అమితాబ్ శర్మ తెలిపారు.

డ్రైవర్ తప్పిదమేమీ లేదు

కోరమాండల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి డ్రైవర్ తప్పిదమేమీ లేదని సిగ్నల్ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడమే కారణమని రైల్వే మంత్రి వైష్ణవ్ చెప్పారు. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్‌లో టాంపరింగ్ ఏమైనా జరిగిందా? విద్రోహకర చర్య అయి ఉండొచ్చా అన్న కోణాల నుంచి కూడా దర్యాప్తు జరుగుతుందని ఆయన తెలిపారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్, పాయింట్ మెషిన్‌లో మార్పు వల్లే ప్రమాదం సంభవించిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు.

గ్రీన్ సిగ్నల్ ఇచ్చాక కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లూప్‌లైన్‌లో గంటకు 128 కి.మీ వేగంతో వెళుతుండగా, బెంగళూరు-హౌరా రైలు గంటకు 126 కి.మీ వేగంతో వెళ్తోందని ప్రాథమికంగా నిర్ధారణ అయిందని అన్నారు. దీనిపై రైల్వే సేఫ్టీ కమిషనర్ నుంచి పూర్తిస్థాయి నివేదిక రావాల్సి ఉందని రైల్వే శాఖ తెలిపింది. ఈ ఘటనలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌నే మొదట గూడ్స్‌ను ఢీ కొన్నదని, రైలులో ఇనుప ఖనిజం ఉండటంతో.. ప్రమాద తీవ్రత పెరిగిందని తెలిపింది. ఈ క్రమంలోనే 'కోరమాండల్' బోగీలు చెల్లాచెదురై డౌన్‌లైన్‌లోకి వచ్చి పడ్డాయని, ఆ సమయంలో డౌన్‌లైన్‌లో వెళ్తున్న బెంగళూరు-హౌరా రైలు చివరి రెండు బోగీలను ఢీకొట్టాయి' అని రైల్వే బోర్డు (ఆపరేషన్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్) సభ్యురాలు జయవర్మ సిన్హా వెల్లడించారు.

మృతుల సంఖ్య సవరింపు

శుక్రవారం నాటి ఘోర రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య సవరించిన లెక్కల మిగతా 2లో

మృతులకు రూ.10 లక్షలు

- తీవ్రంగా గాయపడ్డ వారికి రూ. 5లక్షలు
- నష్టపరిహారం ప్రకటించిన సిఎం జగన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బాలాసోర్ రైలు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు చొప్పున, స్వల్పంగా గాయపడ్డ వారికి లక్ష రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒడిశాలో రైలు ప్రమాదం, తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సిఎం తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తరపున అందిస్తున్న సహాయానికి అదనంగా పరిహారం ఇవ్వాలని తెలిపారు. బాలాసోర్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన సిహెచ్ గురుమూర్తి మరణించారని, ఇది తప్ప రాష్ట్రానికి చెందిన వారెవరూ ఈ ఘటనలో మరణించినట్లుగా ఇప్పటి వరకూ నిర్ధారణ కాలేదని అధికారులు వెల్లడించారు. గాయపడ్డ వారికి మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒడిశాకు వెళ్లిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం తీసుకుంటున్న చర్యలను, విశాఖలో మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పర్యవేక్షణ కార్యకలాపాలను అధికారులు సిఎంకు వివరించారు.

అమిత్‌షా పర్యటనను నిరసించండి

- వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న నేపథ్యంలో విశాఖపట్నంలో ఈ నెల 8న కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా హాజరవుతున్న కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు రాష్ట్రంలోని తొమ్మిది వామపక్ష పార్టీలు ఆదివారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన విద్రోహాన్ని ఈ సందర్భంగా ఎండగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు పలుహామీలను ఇచ్చిందని పేర్కొన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ప్రత్యేకహోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ అంటూ మభ్యపెట్టి ప్యాకేజీని కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. విభజన చట్టంలోని హామీలన్నింటిని నామమాత్రంగా అమలుచేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక నిధుల గురించి పట్టించుకోలేదని, అలాగే పోలవరం నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను విడుదల చేయకుండా రెండు లక్షలమంది పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వరంగ సంస్థ అయిన విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా మోడీ ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతూ ప్రైవేటీకరణకు మొగ్గు చూపుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పండుగలను ఆసరా చేసుకొని మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ రాష్ట్రాల హక్కులను హరించి వేస్తోందని విమర్శించారు.

నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. నూతన ఆర్థిక విధానాలను దూకుడుగా అమలుచేస్తూ దేశ సంపదను కార్పోరేట్‌లకు దోచిపెడుతున్నదన్నారు. ఇలా రాష్ట్రానికి సంబంధించి ప్రతి అంశంలో మోసం చేసిన నరేంద్రమోడీ ప్రభుత్వానికి రాష్ట్రంలో తొమ్మిదేళ్ల వార్షికోత్సవ వేడుకలను జరుపుకునే హక్కు లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి మోసం చేస్తూ ఇలాంటి కార్యక్రమాలను జరపాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ నెల 8వ తేదీన విశాఖపట్నంలో జరిగే అమిత్‌షా పర్యటన పట్ల నిరసనలను వ్యక్తం చేయాలని కోరారు. వివిధ రూపాలలో ఈ నిరసన కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివద్ధిని కోరుకునే వ్యక్తులు, పార్టీలు, సంస్థలు ఈ నిరసన పిలుపును జయప్రదం చేయాలని కోరారు. ఈ ప్రకటనపై సంతకం చేసిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణలతోపాటు వై సాంబశివరావు (సిపిఐ (యంఎల్) న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్‌బాబు (సిపిఐ(యంఎల్)), కాటం నాగభూషణం (యంసిపిఐ(యు)), యన్ మూర్తి (సిపిఐ (యంఎల్) లిబరేషన్), బిఎస్ అమర్‌నాథ్ (యస్‌యుసిఐ (సి)), పివి సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ) వున్నారు.



ప్రమాదంలో ముందు భాగం నుజ్జయిన టిప్పర్

గుడిపైకి దూసుకొచ్చిన టిప్పర్

డ్రైవర్, క్లీనర్ సహా ముగ్గురు మృతి

ప్రజాశక్తి- అన్నవరం(కాకినాడ జిల్లా)

గ్రావెల్ లోడుతో వేగంగా వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి తొలుత వాటర్ ట్యాంకర్‌ను, ఆ తర్వాత వినాయక గుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. వారిలో టిప్పర్ డ్రైవర్, క్లీనర్, గుడిలో నిద్రిస్తున్న వ్యక్తి ఉన్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం గజ్జనపూడికి చెందిన చుక్కలపూడి చంద్రశేఖర్ (30) టిప్పర్ డ్రైవర్‌గా, అదే గ్రామానికి చెందిన ఆలపాటి నాగబాబు (23) క్లీనర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో అన్నవరం నుంచి గ్రావెల్ లోడు వేసుకుని ప్రత్తిపాడుకు బయలుదేరారు. వీరి టిప్పర్ తొండంగి మండలం ఎ.కొత్తపల్లి వద్ద అదుపుతప్పి తొలుత వాటర్ ట్యాంకును, అనంతరం పక్కనే ఉన్న వినాయక గుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్, నాగబాబు, వినాయక గుడిలో నిద్రిస్తున్న తూము లక్ష్మణరావు (45) అక్కడికక్కడే మృతి చెందారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ ఘటనలో వాటర్ ట్యాంకు పాక్షికంగా దెబ్బతినగా, వినాయకుని గుడి పూర్తిగా నేలమట్టమైంది. టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం
- కొనసాగుతున్న జీపుజాతాలు

ట్రిపుల్ 'షాక్'
- విద్యుత్ వినియోగదారులపై మరోవడ్డన
- కొత్తగా యూనిట్‌కు 40 పైసలు వసూలు
- ఏడాదికి 3 వేల కోట్ల భారం
- నెలనెలా 'ట్రూఅప్' అమల్లోకి..

● లోపలి పేజీలో..

కార్మికోద్యమానికి దిక్సూచి పర్స

శత జయంతి ప్రారంభ సభలో వి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ, అమరావతి బ్యూరో

కార్మికోద్యమానికి దిక్సూచి పర్స సత్యనారాయణ అని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రథమ అధ్యక్షులు పర్స సత్యనారాయణ శతజయంత్యుత్సవాల రాష్ట్ర ప్రారంభ సభ ఆదివారం విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, నర్సింగరావు ముఖ్యవక్తలుగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రానికి సిఐటియు మొట్టమొదటి రాష్ట్ర అధ్యక్షులుగా పర్స సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నండూరి ప్రసాదరావు ఎన్నికయ్యారని గుర్తు చేశారు. దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయడంలో వీరద్దరూ దిట్టన్నారు. పర్సా సత్యనారాయణ స్వాతంత్ర్యోదమంలో, తెలంగాణా సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. 1947 నుంచి 1952 వరకు సుమారు ఆరు సంవత్సరాలు జైలు జీవితం గడిపారన్నారు. సింగరేణి ఉద్యోగిగా ఉంటూ యూనియన్ పెట్టి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఉద్యోగం వదిలి కార్మికోద్యమానికి సేవలందించడానికి పూర్తి కాలం కార్యకర్తగా వచ్చారన్నారు. విశాఖపట్నం కార్మికవాడగా తయారు కాబోతుందని ఆనాడే పర్స చెప్పారని, విశాఖలోని ప్రభుత్వరంగ సంస్థలలో సిఐటియు అభివృద్ధికి ఇక్కడే ఉండి కృషి చేశారని తెలిపారు. తన 72 ఏళ్ల జీవితంలో 32 సంవత్సరాలు సిఐటియు అధ్యక్షులుగా కొనసాగారన్నారు. 1991 తరువాత నయాఉదారవాద విధానాల ప్రభావం కార్మికవర్గంపై ఏ రకంగా ఉండబోతుందో ముందుగానే అధ్యయనం చేసి కార్మికవర్గానికి తెలియజేసేవారని వివరించారు. ఎమ్మెల్యేగా పని చేసిన కాలంలో ప్రజా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తారని తెలిపారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం పార్టీ నిర్ణయం మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. విలువలకు, క్రమశిక్షణకు మారుపేరు పర్స, నండూరి ప్రసాదరావు అని తెలిపారు. సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, కార్యదర్శి పి.మణి తదితరులు పాల్గొన్నారు. పర్స సత్యనారాయణతో కలిసి పనిచేసిన సీనియర్ నాయకులు మిగతా 2లో



శతజయంతి సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

పలు జిల్లాల్లో వర్షాలు, ఈదురుగాలులు

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

పశ్చిమ గాలుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం వర్షాలు కురిశాయి. ఈదురుగాలులు, వర్షాలకు చెట్లు విరిగిపడ్డాయి. వాటిలో కొన్ని చెట్లు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పిడుగుపాటుకు శ్రీకాకుళం జిల్లాలో మహిళ మృతి చెందారు. ఈ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బూర్జ మండలం లాభాం గ్రామానికి చెందిన నక్క పద్మావతి (45) ఆవును మేతకు తీసుకెళ్లారు. సమీపంలో పిడుగు పడడంతో ఆమె మృతి చెందారు. ఆవు కూడా మరణించింది. బూర్జలో వడగళ్ల వానపడింది.



పద్మావతి (ఫైల్)

పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సీతంపేట, జియ్యమ్మవలస, వీరఘట్టం తదితర మండలాల్లో ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. పార్వతీపురంలో టిఆర్‌ఎంఎం ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న చెట్టు కూలి విద్యుత్ వైర్లపై పడింది. దీంతో, విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కురుపాంలో రొంపల్లి లక్ష్మి ఇంటిపై చెట్టు పడింది. దీంతో, ఆమె ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈదురుగాలుల తీవ్రతకు పండా వీధికి చెందిన జి.రాము పూరిల్లు పైకప్పు ఎగిరిపోయింది.

కూరాకుల వీధిలో విద్యుత్ వైర్లపై చెట్టు పడి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఎక్కడికక్కడ చెట్లు విరిగి విద్యుత్తు వైర్లు, స్తంభాలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏలూరు జిల్లా ముసునూరు మండల పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలులు, వర్షానికి విద్యుత్ స్తంభాలతోపాటు వృక్షాలు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. పడమర గాలుల ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగుతాయని, దీంతో, సముద్రమట్టంపై ఉన్న వేడి గాలులు ఆవిరిగా మారి వర్షాలకు కారణవుతున్నాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కాగా, గత పది రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనాన్ని ఇచ్చాయి.



శ్రీకాకుళం జిల్లా బూర్జలో కురుస్తున్న వడగళ్ల వాన

న్యూజెర్సీలో తెలుగు విద్యార్థి

సజీవదహనం



శైలేష్

అమెరికా : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన గుర్రపు శైలేష్ బయోమెడికల్ ఇంజినీరింగ్ చదివేందుకు గతేడాది సెప్టెంబర్‌లో అమెరికాకు వెళ్లాడు. స్నేహితులతో కలిసి కారులో రోజూ కాలేజీకి వెళ్లేవాడు. శనివారం కూడా తన స్నేహితులతో కలిసి కారులో కాలేజీకి బయలుదేరాడు. వీరి కారు న్యూజెర్సీలోని సెల్టన్ సర్కిల్ వద్ద అదుపుతప్పి, పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో శైలేష్‌కు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. శైలేష్ తండ్రి సత్యం గతంలో గల్ఫ్‌లో పనిచేశారు. తల్లి గృహిణి. శైలేష్‌కు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు.

బాధితురాలికి కుజ దోషమా?

- వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించడమే
- హైకోర్టు ఆదేశాలను నిలిపేసిన సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అత్యాచార బాధితురాలి జాతకంలో కుజ దోషం ఉందో, లేదో పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు నిలిపేసింది. జ్యోతిషం సైన్స్ ఔనా? కాదా? అనే అంశం జోలికి వెళ్లడం లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నిందితుని బెయిలు దరఖాస్తుపై విచారణ జరిపేటపుడు ఇటువంటి ఆదేశాలు ఇచ్చి ఉండకూడదని తెలిపింది. ఇది పూర్తిగా సందర్భరహితమైన చర్య అని, వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. అసలు విషయాన్ని దీనితో ముడిపెట్టడాన్ని మాత్రమే తాము పరిశీలిస్తున్నామని తెలిపింది.

అత్యాచార బాధితురాలికి కుజ దోషం ఉందని నిందితుని తరపు న్యాయవాది అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనంలో వాదించారు. జాతకంలో కొన్ని గ్రహాలు కలవడం వల్ల కుజ దోషం ఏర్పడుతుందని, ఇది సంతోషకరమైన జీవితానికి అడ్డంకిగా నిలుస్తుందని చెప్పారు. ఆమెను పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశం నిందితునికి లేదని చెప్పారు. అయితే బాధితురాలి తరపు న్యాయవాది మాట్లాడుతూ, తన క్లయింట్‌కు కుజ దోషం లేదన్నారు. ఈ వాదనలపై హైకోర్టు స్పందిస్తూ, నిందితుడు, బాధితురాలు తమ పుట్టిన తేదీ, సమయంతో కూడిన బర్త్ చార్టులను 10 రోజుల్లోగా లక్నో విశ్వవిద్యాలయంలోని జ్యోతిష్య విభాగం అధిపతికి అందజేయాలని ఆదేశించింది. ఈ ఇద్దరి జాతకాల వివరాలను మూడు వారాల్లోగా సీల్డ్ కవర్లో సమర్పించాలని జ్యోతిష్య విభాగాధిపతిని ఆదేశించింది.

బాధితురాలి కథనం ప్రకారం, తనను పెళ్లి చేసుకుంటానని నిందితుడు హామీ ఇవ్వడంతో అతనితో ఆమె అత్యంత సన్నిహితంగా మెలిగింది. పెళ్లి చేసుకోవాలని ఆమె కోరినపుడు, "నీకు కుజ దోషం ఉంది" అని చెప్పి, పెళ్లి చేసుకోవడానికి అతను తిరస్కరించాడు. ఇదిలావుండగా, నిందితునికి హైకోర్టు బెయిలు మంజూరు చేసింది.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, జ్యుడిషియల్ ఫోరం ఇలాంటి దరఖాస్తును అనుమతించేటపుడు ఇది ఒక అంశం కాగలదా? అనేదే ఏకైక ప్రశ్న అన్నారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడం కోసం సమర్థ న్యాయస్థానం జ్యోతిషాన్ని పరిశీలించకూడదన్నారు. హైకోర్టులో తదుపరి విచారణ జూన్ 26న జరుగుతుంది. హైకోర్టు మే 23న ఇచ్చిన ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు నిలిపేసింది. జ్యోతిషం అనేది మిగతా 2లో

మిలటరీ కోర్టులో ఇమ్రాన్ విచారణ?

ఇస్లామాబాద్ : మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను మిలటరీ కోర్టులో విచారించే అవకాశాలు వున్నాయని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ చెప్పారు. మే 9న జరిగిన సంఘటనల్లో ఆయన పాత్ర వుందన్న ఆరోపణలపై విచారణ జరగవచ్చున్నారు. మే 9నాటి దాడుల్లో ఆయన పాత్రపై మిలటరీ న్యాయస్థానం ఆయనను విచారించబోతోందనిది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తాపత్రిక పేర్కొంది. ఇప్పటివరకు ఈ దాడులకు సంబంధించి ఇమ్రాన్‌పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. అయితే విచారణకు అవకాశాలు మాత్రం వున్నాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన తెలిపారు. మే 9నాటి దాడులకు సూత్రధారి ఇమ్రాన్ అయినందున ఆయన్ని మిలటరీ కోర్టులో విచారించవచ్చని హోం మంత్రి రానా సనవుల్లా వ్యాఖ్యానించిన కొన్ని రోజులకే ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం.

సూయజ్‌లో నిలిచిన ఆయిల్ ట్యాంకర్

కైరో : ఈజిప్ట్‌లోని సూయజ్ కాల్వలో ఆదివారం ముడి చమురును తీసుకెళుతున్న ఆయిల్ ట్యాంకర్ నిలిచిపోయిందని దీంతో కెనాల్‌లో రవాణా కార్యకలాపాలకు అంతరాయం కలిగిందని ఈజిప్ట్ అధికారులు తెలిపారు. కాల్వలో 12 కిలోమీటర్ల దూరం వద్ద ఆయిల్ ట్యాంకర్‌లో యాంత్రిక లోపం తలెత్తిందని, సూయజ్ కెనాల్ అథారిటీ ప్రతినిధి జార్జి సాఫ్‌వత్ తెలిపారు. ట్యాంకర్‌ను పక్కకు లాగి ఇతర నౌకలు వెళ్ళేందుకు వీలుగా కెనాల్ అథారిటీ అధికారులు మూడు టగ్‌బోట్లను ఉపయోగించారు. ఆయిల్ ట్యాంకర్ కాల్వలో నిలిచిపోవడంతో దాని వెనుక గల 8 నౌకల రాకపోకలు కూడా స్తంభించాయని సూయజ్ కెనాల్ అథారిటీ అధినేత ఒసామా రబెయ్ తెలిపారు.

28 మంది ఇంకా అందుబాటులోకి రాలేదు

- ఒడిశా రైలు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి మృతి
- ఒకరికి తీవ్రంగా, 21 మందికి స్వల్పంగా గాయాలు
- 92 మంది ప్రయాణం చేయలేదని చెప్పారు
- 553 మంది క్షేమం : మంత్రి


వివరాలు వెల్లడిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ, విశాఖ

ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదానికి సంబంధించి మన రాష్ట్రానికి చెందిన 28 మంది ప్రయాణికులు ఇంకా ఫోన్‌కి అందుబాటులోకి రాలేని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. రైలు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందాడని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయన కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద సంఘటనపై విశాఖ కలెక్టరేట్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకటనాగేశ్వరరావు, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణితో కలిసి ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. మంత్రి బొత్స మాట్లాడుతూ షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841)లో మన రాష్ట్రానికి చెందిన 484 మంది, బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (2864)లో 211 మంది వెరసి మొత్తం 695 మంది రిజర్వేషన్ చేయించుకున్నారని తెలిపారు. వీరిలో 553 మంది క్షేమంగా ఉన్నారని చెప్పారు. ప్రమాద ఘటనలో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు చోడిపల్లి గురుమూర్తి మరణించారని తెలిపారు. ఉపాధి నిమిత్తం ఒడిశాలోని బాలేశ్వర్‌లో ఉంటున్న ఆయన వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి స్వగ్రామం వచ్చి రైలులో వెళ్తుండగా ప్రమాదంలో చనిపోయారని చెప్పారు. రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్రంగా, 21 మందికి స్వల్పంగా గాయాలయ్యాయని తెలిపారు. 92 మంది తాము ప్రయాణం చేయలేదని చెప్పారని మంత్రి బొత్స వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విజయవాడలో అధికారులతో సమీక్ష నిర్వహించారని చెప్పారు. రైలు ప్రమాదానికి గురైన మన రాష్ట్రానికి చెందిన వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు పూర్తి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ముగ్గురు ఐఎఎస్ అధికారులు, ముగ్గురు ఐపిఎస్ అధికారుల బృందం ఒడిశాలోని రైలు ప్రమాద స్థలిలో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఎటువంటి ఫోన్ కాల్సూ రాలేదని, ఎవరైనా తమ కుటుంబ సభ్యులు ఈ రైళ్లలో ప్రయాణించినట్లయితే వారి వివరాలను హెల్ప్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలని బొత్స విజ్ఞప్తి చేశారు. రైలు ప్రమాద ఘటన నుంచి బయటపడి విశాఖపట్నం చేరుకున్న ఏడుగురు బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున రవాణా ఖర్చుల నిమిత్తం రూ.30 వేల చెక్కును మంత్రి అందజేశారు.

భువనేశ్వర్‌లో 120 గుర్తు తెలియని మృతదేహాలు

- వెబ్‌సైట్‌లో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలు
- మంత్రి ఆదిమూలపు సురేష్


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒడిశా రైలు ప్రమాదంలో మరణించిన వారిలో 120మంది వివరాలు లభ్యం కాలేదని, అటువంటి గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించిన సమాచారం అందించేందుకు 1929 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. రైలు ప్రమాదంపై ఒడిశా ప్రభుత్వం నుంచి తమకు అందిన సమాచారాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరణించిన వారిని గుర్తించడానికి ఎన్‌ఒకెలను వివిధ ఆసుపత్రుల్లోని మార్చురీలకు తీసుకెళ్లడానికి ఏర్పాటు చేశారని, ఏదైనా సహాయం అవసరమైతే ఐఎఎస్ అధికారి తిరుమలనాయక్ ఫోన్ నెంబరు 8895351188కు సంప్రదించాలని మంత్రి తెలిపారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రయాణికుల జాబితాలు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. మరణించిన ప్రయాణికుల జాబితాలు, ఫోటోగ్రాఫ్‌లు కూడా గుర్తింపును సులభతరం చేయడానికి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారని తెలిపారు. బాలాసోర్ రైలు ప్రమాదంలో మరణించిన వారి ఫోటోలు వారి గుర్తింపును సులభతరం చేయడానికి మాత్రమే పోస్ట్ చేయబడ్డాయన్నారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రయాణికుల జాబితా వివరాలు https//srcodisha.nic.in, https//www.bmc.gov.in, https//www.osdma.org వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీడియోలు, చిత్రాలను పిల్లలు చూడవద్దని మంత్రి సూచించారు. వెబ్‌సైట్‌లోని ఫోటోలు, వీడియోలు మీడియా/ వ్యక్తిగతం /సంస్థలు ఒడిశా స్పెషల్ రిలీఫ్ కమిషనరు ముందస్తు అనుమతి లేకుండా ముద్రించరాదని, ఉపయోగించకూడదని పేర్కొన్నారు. భువనేశ్వర్ రైల్వే స్టేషన్, బారముండా బస్టాండ్, విమానాశ్రయం వద్ద హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారని మంత్రి సురేష్ తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులూ పోరుకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ ఉక్కు కార్మికులతో కలిసి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సైతం విశాఖ ఉక్కును రక్షించుకునేందుకు పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు నాయకులు పివిఎస్‌బి శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 843వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని సిఐటియుకు చెందిన కాంట్రాక్టు కార్మికులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతో పాటు ఇతర కార్మిక హక్కుల సాధనకు కాంట్రాక్టు కార్మికులు ముందుండి పోరాడడానికి సిద్ధంగా ఉంటారన్నారు. ఈ ఉద్యమంలో కాంట్రాక్టు కార్మికులు ప్రధాన భూమిక పోషించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల జీతాల పెంపు, బోనస్ తదితర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోవడానికి ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కాంట్రాక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, పి మసేను యు సోమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న సిఐటియు కాంట్రాక్టు కార్మికులు


శాంతి యజ్ఞంలో పాల్గొన్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కొట్టు సత్యనారాయణ

శాంతి యజ్ఞంలో పాల్గొన్న సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలోని గోశాలలో ఆదివారం నిర్వహించిన శాంతి యజ్ఞంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. ఇటీవల విజయవాడలో రాష్ట్ర దేవాదాయశాఖ నిర్వహించిన అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞంలో సిఎం పాల్గొన్న సంగతి పాఠకులకు తెలిసిందే. మహాయజ్ఞం విజయవంతమైన సందర్భంగా రాష్ట్ర ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ గోశాలలో శాంతి యజ్ఞాన్ని నిర్వహించినట్లు వేదపండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, జనవిజ్ఞాన వేదిక, ఆవారా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ చిత్రలేఖనం పోటీల్లో 200 మంది బాలలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎంబివికె కన్వీనర్ మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. నాగార్జున యూనివర్సిటీ పర్యావరణ శాఖ అధిపతి బ్రహ్మాజీరావు మాట్లాడుతూ 1972లో ప్రారంభించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం ఈనాటికి 50 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభిస్తారని, ఈ ఏడాది ప్లాస్టిక్ రహిత సంవత్సరంగా ముందుకు తెచ్చారని తెలిపారు. ఎఫ్‌క్రానిక్స్ అధినేత రామకృష్ణ మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి గ్లోబల్ వార్మింగ్‌పై పెద్ద పోరాటం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను నిరోధించాలని కోరారు. కార్యక్రమంలో ఆవారా వ్యవస్థాపకులు అజయ్ కాట్రగడ్డ, ఇన్నర్ వీల్స్ క్లబ్ బాధ్యులు కవిత, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాస్, అధ్యక్షులు సునీల్, ఎంబివికె బాధ్యులు యువి రామరాజు, ఐజాక్ న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులతో విజేతలు, నిర్వాహకులు

కుప్పకూలిన నిర్మాణంలో వంతెన

పాట్నా : బీహార్‌లో నిర్మాణంలో ఉన్న ఒక వంతెన ఆదివారం కుప్పకూలిపోయింది. భగల్‌పూర్ జిల్లాలో గంగా నదిపై రూ. 1,717 కోట్లతో నిర్మిస్తున్న అగువాని-సుల్తాన్‌గంజ్ వంతెనలో కొంత భాగం ఆదివారం కూలిపోయింది. ఈ దృశ్యాలను కొంత మంది స్థానికులు తమ సెల్‌ఫోన్లతో చిత్రీకరించారు. ఈ ప్రమాదంతో ఎలాంటి మరణాలు సంభవించలేదని అధికారులు చెప్పారు. అధికారుల సమాచారం ప్రకారం 206 మీటర్ల పొడవైన ఈ వంతెనలో రెండో నంబర్ పిల్లర్ నుంచి మూడో నంబర్ పిల్లర్ వరకూ కూలిపోయింది. మిగిలిన వంతెనకు పగుళ్లు ఏర్పడ్డాయి. వంతెన కూలిపోవడంతో నితీష్ కుమార్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. నితీష్ ప్రభుత్వం అవినీతిలో కూరుకపోవడంతోనే వంతెన కుప్పకూలిపోయిందని ఆరోపించాయి. బీహార్‌లో గత ఏడాదిలో కూడా బెగుసరాయ్ జిల్లాలో గండక్ నదిపై నిర్మించిన వంతెన కుప్పకూలిపోయింది.

'ట్యాక్సీ' మెడపై టిటిడి 'కత్తి'

- 'ఫిట్‌నెస్' పేరుతో పొట్టగొట్టే నిర్ణయం
- త్వరలో అమలుకు కసరత్తు
- రోడ్డున పడనున్న 3 వేల మంది డ్రైవర్లు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల ట్యాక్సీ డ్రైవర్ల పొట్టగొట్టేలా టిటిడి పిడుగులాంటి నిర్ణయం తీసుకుంది. ఇటీవల తిరుమల ఘాట్‌రోడ్డులో జరిగిన వరుస ప్రమాదాలను 'బూచి'గా చూపి 15 ఏళ్లు దాటిన ట్యాక్సీలను 'ఫిట్‌నెస్' పేరుతో అలిపిరి వద్దనే నిలిపేయనుంది. ఆర్‌టిఒ 'ఫిట్‌నెస్' సర్టిఫికెట్ ఇచ్చినా ససేమిరా అననుంది. ఇదేగనుక జరిగితే దాదాపు మూడు వేల మంది ట్యాక్సీ డ్రైవర్లు రోడ్డున పడనున్నారు. తిరుమలకు వెళ్లే ప్రయివేట్ ట్యాక్సీలకు సంబంధించి ఇంతవరకూ ఎటువంటి ప్రమాదమూ జరిగిన దాఖలాలు లేవు. 'ఫిట్‌నెస్సే' ప్రాతిపదిక అయితే, తాజాగా ఆర్నెల్ల క్రితం నుంచి ఘాట్‌లో తిప్పుతున్న ఎలక్ట్రికల్ బస్సు బోల్తా పడడం గమనార్హం. పచ్చదనం నిండిన తిరుమల అందాలను తిలకించేందుకు ఎక్కువమంది భక్తులు ట్యాక్సీలను ఆశ్రయిస్తూ ఉంటారు. ఆహ్లాదంగా కనిపించిన చోట ట్యాక్సీలను ఆపి మరీ ఫోటోల జ్ఞాపకాలను భద్రపరచుకుంటారు. తిరుమల బస్సుల్లో ఈ సౌకర్యం ఉండదు. అందుకే తిరుమలను నమ్ముకుని ఐదు వేల మందికిపైగా ట్యాక్సీ డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారు. తిరుపతి శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి, కోనేటికట్ట వద్ద ట్యాక్సీ స్టాండులను ఏర్పాటు చేసుకుని సందర్శకులకు తిరుమలతో పాటు జిల్లాలోని ఆలయాల సందర్శనకు తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. అలాంటివారి కడుపుగొట్టేలా 15 ఏళ్లు పైబడిన ట్యాక్సీలను తిరుమల కొండకు అనుమతించేది లేదని హుకుం జారీకి టిటిడి రంగం సిద్ధం చేసింది. ఇటువంటి ట్యాక్సీలు మూడు వేల వరకూ ఉంటాయని సమాచారం. దీంతో, వీటి డ్రైవర్లు ఆందోళనతో ఉన్నారు. తిరుపతి ట్యాక్సీ డ్రైవర్లకు ఘాట్ రోడ్డులో ప్రయాణంపై పూర్తి అవగాహన ఉంది. ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా అనేక సంవత్సరాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ, బయట ప్రాంతాల నుంచి వచ్చే వాహన డ్రైవర్లకు ఘాట్‌రోడ్డు మలుపులపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాంటి వాహనాలపై టిటిడి ప్రత్యేక దృష్టి సారించాలని, తమ పొట్టగొట్టొద్దని వారు వేడుకుంటున్నారు.


తిరుమలలో ట్యాక్సీ స్టాండ్

కొండనే నమ్ముకున్నాం



డిగ్రీ వరకూ చదువుకున్నాను. ఉద్యోగం లేదు. ట్యాక్సీనే జీవనోపాధిగా కొండనే నమ్ముకుని 12 ఏళ్లుగా డ్రైవర్‌గా ఉంటున్నాను. ఏ మలుపు వద్ద ఎంత జాగ్రత్తగా ఉండాలో మాకు బాగా తెలుసు. నాకు తెలిసి తిరుమలకు ట్యాక్సీ నడిపే వాహనాలకు సంబంధించి ఒక్క ప్రమాదమూ జరగలేదు. ఉన్నట్లుండి టిటిడి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మా పొట్టగొట్టడమే.

- యువరాజ్, తిరుపతి

సొంత వాహనదారుల వల్లే ప్రమాదాలు



శ్రీవారి సందర్శకులపై ఆధారపడి 15 ఏళ్లుగా ట్యాక్సీ నడుపుతున్నాను. తిరుమల ఘాట్‌లో ప్రమాదాలు జరుగుతున్నాయంటే ఘాట్‌లో వాహనం నడిపే అనుభవం లేనివారి వల్లే. లోకల్ ట్యాక్సీలు ఎక్కడా ప్రమాదాలకు గురికావడం లేదు. సందర్శకులను సురక్షితంగా కొండకు తీసుకెళ్లి, తీసుకొస్తున్నాం. దయచేసి ఫిట్‌నెస్ పేరుతో మా పొట్టగొట్టొద్దు.

- ప్రతాప్‌నాయక్

తిరుమల ఘాట్‌లో ప్రమాదాలకు కారణాలివే...

- టిటిడి, ఆర్‌టిఒ అధికారులు సమన్వయంతో ఘాట్‌రోడ్డులో వెళ్లే వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలించాలి. డ్రైవర్లకు హెవీ వెహికల్ లైసెన్స్ ఉందో? లేదో? పరిశీలించే నాధుడే లేడు.
- తిరుమల ఘాట్ రోడ్‌లో టిటిడి నిబంధనల ప్రకారం 28 నిమిషాలు తిరుమల కొండకు వెళ్లేందుకు, తిరుపతికి 40 నిమిషాలు సమయపాలన పాటించాలి అని ప్రయివేటు వాహన డ్రైవర్లకు తెలిసేలా ఘాట్‌రోడ్‌లో ఎక్కడా 'సూచిక బోర్డులు' ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.
- టిటిడి అధికారులు రెండు ఘాట్ రోడ్లలో స్పీడ్ లిమిట్ కెమెరాలను' ఏర్పాటు చేసి స్పీడ్ లిమిట్‌ను అతిక్రమించిన వాహనాలకు జరిమానా విధిస్తే ప్రమాదాలు నివారించవచ్చు!

క్షతగాత్రులకు అండగా నిలవాలి

- రైలు ప్రమాదంపై ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైలు ప్రమాదంలో క్షతగాత్రులందరికీ అండగా నిలబడాలని పలు ప్రజాసంఘాలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ప్రమాదంలో మరణించిన వారికి తీవ్ర సంతాపం ప్రకటిస్తూ ఆయా సంఘాల నాయకులు సిహెచ్ నర్సింగరావు (సిఐటియు), ప్రభాకరరెడ్డి (ఎఐకెఎస్), వి వెంకటేశ్వర్లు (వ్యవసాయ కార్మిక సంఘం), డి రమాదేవి (ఐద్వా), జి రామన్న (డివైఎఫ్ఐ), అశోక్ (ఎస్ఎఫ్ఐ), అంద్ర మాల్యాద్రి (కెవిపిఎస్) ఆదివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఈ ఘోర ప్రమాదానికి కేంద్రప్రభుత్వం సంపూర్ణ బాధ్యత వహించాల్సి ఉందని పేర్కొన్నారు. అన్ని ప్రజాసంఘాలు, మహిళా సంఘాలతో కలిసి మృతులకు ఆయా రైల్వే స్టేషన్లలో, జిల్లా కేంద్రాలు, రైల్వే జంక్షన్లు, స్టేషన్ల వద్ద సోమ, మంగళ వారాల్లో నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. క్షతగాత్రులకు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి పేర్లు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాద కారణాలపై తక్షణం విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుల్లెట్, వందే భారత్ వంటి హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెడుతున్న ప్రభుత్వం తగిన భద్రతా చర్యలను కూడా చేపట్టాల్సి ఉందని తెలిపారు. సామాన్య ప్రజల, ప్రయాణికుల బాధలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. సామాన్య ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో సహా అత్యున్నత స్థాయికి చేరిన దశలో లూప్ లైన్‌లోకి కోరమాండల్ రైలు వెళ్లడం రైల్వేశాఖ అశ్రద్ధ అని, ప్రమాణాలు పాటించకపోవడాన్ని తెలియజేస్తుందని విమర్శించారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను సంపూర్ణంగా ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కెఆర్ సూర్యనారాయణపై ప్రభుత్వం కక్ష సాధింపు

- ఎపి కమర్షియల్ ట్యాక్సెస్ సర్వీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షసాధింపు చర్యలతో పాటు వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు వాణిజ్యపన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జిఎం రమేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సిబిఐ దర్యాప్తు

మొదటి పేజి తరువాయి

ప్రకారం ఇది 275గా నిర్ధారణ అయిందని ఒడిశా ప్రభుత్వం తెలిపింది. ఇంతకుముందు 288 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పిన అధికారులు, తాజాగా మృతదేహాల లెక్కింపులో పొరపాట్లు జరిగిందని అంగీకరించారు. 'కొన్ని మృతదేహాలను రెండు సార్లు లెక్కించడం వల్లే ఈ గందరగోళం ఏర్పడిందని ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు.

275 మంది మృతుల్లో ఇప్పటి వరకు 78 మృతదేహాలను గుర్తించి వారి బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. మరో 10 మృతదేహాలను అప్పగించే ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. మిగతా 187 మృతదేహాల్లో 170 భువనేశ్వర్‌కు, 17 బాలాసోర్ జిల్లా కేంద్రాల్లో మార్చురీలకు తరలించినట్లు తెలిపారు.

సుప్రీంలో పిల్

మూడు రైళ్ల ఘోర దుర్ఘటనకు అసలు కారకులెవరో నిర్ధారించేందుకు దీనిపై సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలోని కమిషన్ ద్వారా విచారణ జరిపించాలని ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం సుప్రీం కోర్టులో దాఖలైంది.

వందేభారత్ ఇంజిన్ల పరిస్థితి ఏమిటి?

కోరమాండల్, యశ్వంత్ పూర్ సూపర్ ఫాస్ట్ రైళ్ల ప్రమాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన వందేభారత్ రైళ్ల ఇంజిన్లు, భద్రత పరిస్థితి ఏమిటని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ప్రశ్నించారు.

రైల్వే భద్రతా కమిషన్ సిఫారసులేమయ్యాయి? : ఖర్గే

రైల్వే ప్రమాదాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం, కాగ్ ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రైల్వే భద్రతపై పార్లమెంటరీ స్థాయీ సంఘం తన 323 వ నివేదికలో అనేక సిఫారసులు చేసిందని, వాటిని అమలు చేయడంలో రైల్వే బోర్డు నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని అన్నారు. రైల్వే భద్రతా కమిషన్‌కు తగినన్ని నిధులను కేటాయించడం లేదని విమర్శించారు.

ఒడిశా రైలు ప్రమాద మృతులకు పోప్ సంతాపం



వాటికన్ సిటీ : ఒడిశా లోని బాలాసోర్‌లో శుక్రవారం రాత్రి సంభవించిన తీవ్ర రైలు ప్రమాద దుర్ఘటనలో మరణించిన వారికి పోప్ ఫ్రాన్సిస్ తీవ్ర సంతాపం ప్రకటించారు.. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేశారు. ఆదివారం సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో ఆదివారం జరిగిన ప్రార్ధనల సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ రైలు ప్రమాద బాధితులను స్మరించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రెండు రోజుల క్రితం సంభవించిన పెను విషాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆయన ప్రార్ధనలు చేశారు.

బాధితురాలికి కుజ దోషమా?

మొదటి పేజి తరువాయి

సైన్సా? కాదా? అనే అంశం జోలికి వెళ్లడం లేదని జస్టిస్ సుధాంశు ధూలియా, పంకజ్ మిట్టల్ వెకేషన్ బెంచ్ చెప్పింది. నిందితుని బెయిలు దరఖాస్తుపై విచారణ జరిపేటపుడు ఇటువంటి ఆదేశాలు ఇవ్వకుండా ఉండి ఉండవలసిందని తెలిపింది. హైకోర్టు పార్టీల జాతకాల నివేదికలను ఎందుకు కోరిందో అర్థంకావడం లేదని తెలిపింది. బెయిలు దరఖాస్తుపై విచారణ జరిపేటపుడు జోతిష్యంపై రిపోర్టు అవసరం లేదని స్పష్టం చేసింది. దరఖాస్తులోని యోగ్యతల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు తెలిపింది.

కార్మికోద్యమానికి దిక్సూచి పర్స

మొదటి పేజి తరువాయి

జివిఎన్ చలపతి, ఆర్.బాబూరావు, పి.నారాయణమూర్తి, అనపర్తి అప్పారావు, సిహెచ్‌ఎల్‌ఎన్.శాస్త్రి తదితరులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

పోరాటయోధుడు పర్సా

కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడానికి అహర్నిశలూ కృషి చేసిన పోరాట యోధుడు పర్స సత్యనారాయణ అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పర్స సత్యనారాయణ శతజయంత్యుత్సవాల సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలనూ ఐక్యం చేసేందుకు పర్స కృషి చేశారని తెలిపారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికవర్గం నష్టపోతోందన్నారు. పర్స శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఏడాదిపాటు అన్ని జిల్లాల్లో సభలు, సదస్సులు జరపాలని యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ సభలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి కెఆర్‌కె మూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నర్సింహులు, ఎంవి సుధాకర్ పాల్గొన్నారు.

వరుణుడు కరుణిస్తేనే..!

- ఐసిసి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్

లండన్ : 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ పోరు కోసం ఇటు భారత జట్టు అభిమానులు, ఇటు ఆస్ట్రేలియా క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జూన్ 7-11న ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు లండన్‌లోని ది ఓవల్ మైదానం వేదికగా నిలువనుంది. అగ్రజట్ల సమరంలో తుది ఫలితంతో పాటు రానున్న అరుదైన రికార్డు కోసం ఇరు జట్ల అభిమానులు ఉత్సుకత చూపిస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియాలు ఐసీసీ మూడు ప్రధాన టోర్నీల్లో చాంపియన్లుగా నిలిచాయి. వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్ సహా చాంపియన్స్ ట్రోఫీలను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు ఈ రెండు జట్లను ఊరిస్తున్న ఏకైక ఐసీసీ ట్రోఫీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గద. ది ఓవల్‌లో ఐసీసీ టెస్టు గద నెగ్గిన జట్టు.. ఐసీసీ నాలుగు టైటిళ్లు నెగ్గిన జట్టుగా చరిత్ర సృష్టించనుంది. అయితే.. ఈ ఉత్సాహంపై వరుణుడు నీళ్లు చల్లే ప్రమాదం లేకపోలేదు. **సూచనలు క్లియర్! :** సాధారణంగా ఇంగ్లాండ్‌లో వేసవి జూన్ నెలతో ఆరంభం అవుతుంది. ఒకవేళ ఐదు రోజుల ఆటలో వర్షం కారణంగా ఏ రోజు ఆట సాధ్యపడకపోయినా.. జూన్ 12 రిజర్వ్ డేను వాడుకునేందుకు అవకాశం ఉంది. వాతావరణ సూచనల ప్రకారం ఐదు రోజుల ఆటలో ఒక్క రోజు వరుణుడు ఆటంకం కలిగిస్తే పెద్ద ప్రమాదం లేదు. 90 ఓవర్ల ఆట నష్టపోయినా.. రిజర్వ్ డేను ఉపయోగించుకోవచ్చు. కానీ లండన్‌ది అనిశ్చితి వాతావరణం. ముంబయి తరహాలో ఎప్పుడు వర్షం కురుస్తుంది, ఎప్పుడు ఎండ కాస్తుందో చెప్పటం కష్టం! ఇదే అభిమానులను టెన్షన్‌కు గురిచేస్తుంది. **ఓవల్‌లో ప్రాక్టీస్ :** అరుండెల్ క్యాసిల్ క్రికెట్ క్లబ్ నుంచి శనివారం లండన్‌కు చేరుకున్న భారత క్రికెటర్లు.. ఆదివారం ది ఓవల్ మైదానంలో సాధన చేశారు.

నేడు క్లాప్ ఆధ్వర్యాన విజయవాడలో ర్యాలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణంపై నగర వాసుల్లో అవగాహన పెంచేందుకు ఈనెల 5న విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తున్నామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సిఇఒ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తడి, పొడి చెత్త సేకరణ చాలాకాలంగా జరుగుతున్నప్పటికీ ట్రిపుల్ ఆర్ కేంద్రాలను నెలకొల్పాలనే నూతన ప్రక్రియను సంస్థ తాజాగా చేపట్టింది. పునర్వినియోగ వ్యర్థాలు సేకరించడమే లక్ష్యంగా గత నెల 17నుంచి ఈ నెల 5వరకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల పరిధిలో 3,495 ఆర్ఆర్ఆర్ కేంద్రాలను నెలకొల్పినట్లు ఆయన తెలిపారు.

వెబ్‌సైట్‌లో 'మోడల్ స్కూల్' పరీక్ష హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడల్ స్కూల్ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించిన పరీక్ష హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయని ఎపి మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎంవి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశానికి సంబంధించిన పరీక్ష ఈ నెల 11వ తేదిన జరగనుందని వెల్లడించారు. పరీక్ష హాల్ టికెట్లను apms.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.




జకో..17వ సారి

- ప్రీ క్వార్టర్స్‌లో సెర్బియా స్టార్
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్ (ఫ్రాన్స్) : సెర్బియా యోధుడు, మూడో సీడ్ నొవాక్ జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 17వ సారి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ నాల్గో రౌండ్లో నొవాక్ జకోవిచ్ 6-3, 6-2, 6-2తో వరుస సెట్లలో జువాన్ పాబ్లో వారిలాస్ (పెరు)పై అలవోక విజయం సాధించాడు. ఏడు ఏస్‌లతో మెరిసిన జకోవిచ్.. మూడు డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడినా ప్రత్యర్థికి ఒక్క సెట్ కోల్పోలేదు. ఆరు బ్రేక్ పాయింట్లతో రెచ్చిపోయిన జకోవిచ్ పాయింట్ల పరంగా 88-54తో తిరుగులేని ఆధిపత్యం చెలాయించాడు. జకోవిచ్ 18 గేములు గెల్చుకోగా.. పెరు ఆటగాడు కేవలం ఏడు గేములకే పరిమితం అయ్యాడు. జకోవిచ్ సర్వ్‌ను ఓ సారి బ్రేక్ చేసిన జువాన్ పాబ్లో.. అదే జోరు నిలకడగా చూపించటంలో విఫలమయ్యాడు. రష్యా ఆటగాడు కారెన్ కచనోవ్ నాలుగు సెట్ల మ్యాచ్‌లో గెలుపొందాడు. ఇటలీ ఆటగాడు లారెంజో సోనెగపై 1-6, 6-4, 7-6(9-7), 6-1తో కచనోవ్ అదరగొట్టాడు. మెన్స్ సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు.

మహిళల సింగిల్స్ విభాగంలో కరోలినా ముచోవ (చెక్ రిపబ్లిక్) ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. నాల్గో రౌండ్ మ్యాచ్‌లో రష్యా క్రీడాకారిణి ఎలినా అవనేశ్యన్‌పై ముచోవ విజయం సాధించింది. 6-4, 6-3తో వరుస సెట్లలోనే గెలుపొందింది. ఏడు బ్రేక్ పాయింట్లు సాధించిన కరోలిన ముచోవ.. పాయింట్ల పరంగా 71-59తో పైచేయి సాధించింది. ఇక బెల్జియం భామ ఎలిసి మార్టెన్స్ గెలుపొందిన రష్యా అమ్మాయి అనస్థాసియ ప్రీ క్వార్టర్స్ బెర్త్ దక్కించుకుంది. 3-6, 7-6(7-3), 6-3తో అనస్థాసియ మూడు సెట్ల సమరంలో విజయం సాధించింది.

ట్రిపుల్ 'షాక్'



- విద్యుత్ వినియోగదారులపై మరోవడ్డన
- కొత్తగా యూనిట్‌కు 40 పైసలు వసూలు
- ఏడాదికి రూ.3 వేల కోట్ల భారం
- నెలనెలా 'ట్రూఅప్' అమల్లోకి..

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం భారాల మీద భారాలు మోపుతూ విద్యుత్ వినియోగదారుల నడ్డి విరుస్తోంది. గడిచిన 15 నెలల కాలంలోనే ముచ్చటగా మూడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వం నాల్గవసారి కూడా కొత్త భారాన్ని మోపింది. కేంద్ర ప్రభుత్వం తాజా ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా ట్రూఅప్ విధానం మే నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) అనుమతి లేకుండానే డిస్కమ్‌లు నేరుగా వినియోగదారులపై భారాలు మోపొచ్చని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో యూనిట్‌కు 40 పైసలు చొప్పున కొత్త భారాన్ని వినియోగదారులపై డిస్కమ్‌లు వేశాయి. కొత్తగా కలిసిన ఛార్జీలతో మే నెలలో వచ్చిన అధిక బిల్లులు చూసుకుంటున్న ప్రజలు బిక్కమొహం వేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ పంపిణీ సంస్థలు రెండుసార్లు రూ.5,983 కోట్ల భారం మోపాయి. ట్రూఅప్ పేరుతో రూ.2,900 కోట్లను 2022 ఆగస్టు నుంచి, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.3,083 కోట్లను వసూలు చేస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన ఇంధన సర్దుబాటు ఛార్జీలతో నెలకు రూ.280 కోట్లు, ఏడాదికి సుమారు రూ.3 వేలకోట్ల భారం ప్రజలపై పడనుంది. దీంతో వాడిన విద్యుత్‌తోపాటు ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలకే వినియోగదారులు 15 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 248 యూనిట్ల విద్యుత్ వాడిన వినియోగదారునికి అసలు బిల్లు రూ.1218.25, దీనికి ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్‌ఛార్జీలు కలిపితే రూ.1,324 అవుతుంది. ఇతనికి ట్రూఅప్ రూ.53.83, పాత ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.51.26, కొత్త ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.97.60 కలుపుకుని రూ.1,536 బిల్లు వచ్చింది. రాష్ట్రంలో 1.90 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. మే నెలలో రాష్ట్రంలో సుమారు 7 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. మే నెలలో వాడిన విద్యుత్‌కు అదనంగా యూనిట్‌కు 40 పైసలు చొప్పున డిస్కమ్‌లు వసూలు చేయడంతో సుమారు రూ.280 కోట్ల భారం పడనుంది. ఇప్పటికే 100 యూనిట్లకు ఎపిఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు రూ.43, ఇపిడిసిఎల్ వినియోగదారులు రూ.26, సిపిడిసిఎల్ వినియోగదారులు రూ.42 చొప్పున చెల్లిస్తున్నారు. ఇప్పుడు కొత్త ఛార్జీలతో ఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు 100 యూనిట్లకు రూ.83, ఇపిడిసిఎల్ వినియోగదారులు రూ.66, సిపిడిసిఎల్ వినియోగదారులు రూ.82 చొప్పున చెల్లించాలి. ఈ ఛార్జీలు మొదటి త్రైమాసికం వరకు మాత్రమే. రెండు, మూడు, నాల్గవ త్రైమాసికాల్లో ఇవి మారతాయి. రెండో త్రైమాసికంలో ఎస్‌పిడిసిఎల్ వినియోగదారులు రూ.126, ఇపిడిసిఎల్ రూ.110, సిపిడిసిఎల్ రూ.125 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. నెలనెలా ట్రూఅప్ విధానంతో ఏడాది చివరిలో కూడా డిస్కమ్‌లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి మరోసారి ప్రతిపాదనలు పంపే అవకాశం ఉంది. దీనికి కూడా ఎపిఇఆర్‌సి ఆమోదిస్తే ప్రజలపై ఐదో భారం పడే ప్రమాదం ఉంది.

12న పల్నాడు జిల్లాకు ముఖ్యమంత్రి

- జెవికె కిట్ల పంపిణీకి ప్రారంభోత్సవం
- కృష్ణా నదిపై భారీ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

ప్రజాశక్తి - క్రోసూరు (పల్నాడు జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విద్యా కానుక (జెవికె) కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 12న పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండల కేంద్రంలో నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొని బహిరంగ సభలో మాట్లాడనున్నారు. తొలుత అచ్చంపేట మండలం మాదిపాడు నుండి ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని ముత్యాల గ్రామానికి కనెక్టివిటీ కోసం సుమారు రూ.60 కోట్లతో కృష్ణా నదిపై భారీ వంతెన నిర్మాణానికి మాదిపాడు వద్ద సిఎం శంకుస్థాపన చేస్తారు. అనంతరం క్రోసూరులో నూతనంగా నిర్మించిన పాలిటెక్నిక్ కాలేజీని, జెవికె కిట్ల పంపిణీని ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు, సభ నిర్వహణ స్థలాన్ని ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్ శివశంకర్, ఎస్‌పి వై రవిశంకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పోలీస్ బందోబస్తు, పార్కింగ్, హెలిప్యాడ్, రూట్ మ్యాప్, శంకుస్థాపన, ప్రారంభోత్సవ ప్రాంతాలు, బహిరంగ సభ నిర్వహించే ప్రాంతం మొత్తం పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. భద్రతా చర్యలపై పలు అంశాలను కలెక్టర్‌కు ఎస్‌పి వివరించారు. సమావేశంలో జెసి శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్ఒ వినాయకం, డిఇఒ శామ్యూల్, జెడ్‌పి సిఇఒ మోహన్‌రావు, ఆర్ అండ్ బి అధికారి రాజా నాయక్, ఎంఇఒ ఏసురత్నం, ఉపసర్పంచ్ మస్తాన్ పాల్గొన్నారు.

హామీల అమలులో వైసిపి ముందంజ : అంబటి

'మేనిఫెస్టో అంటే జగన్' అంశంపై సెమినార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో అన్ని పార్టీల కంటే వైసిపి ముందంజలో ఉందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు హిందూ కళాశాలలో ఆదివారం 'మేనిఫెస్టో అంటే జగన్' అంశంపై సదస్సుకు వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కామాణిక్యవర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో మంత్రి అంబటి మాట్లాడుతూ గతంలో చాలా పార్టీలు అధికారంలోకి వచ్చేందుకు పలు హామీలతో మేనిఫెస్టోలు రూపొందించి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని మరచిపోయేవని అన్నారు. టిడిపి కూడా 2014లో విడుదల చేసిన మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చి ఆరు కూడా అమలు చేయలేదని అన్నారు. ప్రధానంగా రుణమాఫీ అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలోని వాగ్దానాల్లో 90 శాతానికి పైగా అమలు చేశారని, మిగతావీ అమలుకు ప్రయత్నిస్తారని తెలిపారు. ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఆర్థిక రంగ నిపుణులు డి పాపారావు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.2.20 లక్షల కోట్లు నగదు బదిలీ ద్వారా పంపిణీ చేశామన్నార.. సదస్సులో శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు ముస్తాఫా, కిలారి రోశయ్య, వైసిపి మంగళగిరి, తాడేపల్లి నగర అధ్యక్షులు డి.వేమారెడ్డి ప్రసంగించారు.



పాదయాత్రలో అభివాదం చేస్తున్న నారా లోకేష్

కక్షతోనే కాపు కార్పొరేషన్ నిర్వీర్యం

- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-చాపాడు

కాపులపై కక్షతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 115వ రోజుకు చేరుకుంది. ఆదివారం కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గంలోని ఖాజీపేట మండలం భూమాయపల్లె విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఇంజినీర్‌కొట్టాలు, పేరారెడ్డికొట్టాలు, బుడ్డాయపల్లె, ఖాజీపేట, పత్తూరు, దుంపలగట్టు, కొత్తపేట, చెన్నముక్కపల్లె వరకు సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, బలిజలు, రైతులతో ఆయన సమావేశాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ బలిజలు జగన్ చేతిలో బాధితులుగా మారారన్నారు. విదేశీ విద్య పథకాన్ని రద్దు చేశారని తెలిపారు. విద్యా, ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ మేరకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చామన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.3100 కోట్లు ఖర్చు చేశామని, ఎన్‌టిఆర్ విదేశీ విద్యాదరణ పథకం ద్వారా 4,528 మంది కాపు విద్యార్థులను విదేశాల్లో చదివించామని గుర్తు చేశారు. కాపు కార్పొరేషన్ ద్వారా 66.50 కోట్లు రుణాలుగా ఇచ్చామని, 33,594 మందికి నైపుణ్యాభివద్ధి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రతి జిల్లాలో రూ.5 కోట్లతో కాపు భవన్‌లను నిర్మించామన్నారు. జగన్ కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి ఒక్క రూపాయి రుణం ఇవ్వకుండా కాపులను ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతీశారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో అమలు చేసిన విదేశీ విద్య పథకం, నిరుద్యోగ భృతి మళ్లీ ప్రారంభిస్తామని తెలిపారు. పాదయాత్రలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు హరిప్రసాద్, ధనపాల జగన్, బిఎన్ శ్రీనివాసులు, దాసరి బాబు పాల్గొన్నారు.



ప్రాణం తీసిన పూచీకత్తు..

- హత్యచేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు
- ఏడుగురు నిందితులు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

అప్పు పూచీకత్తు వ్యవహారం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన వైఎస్ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలో చోటు చేసుకుంది. ఈ నెల ఒకటో తేదీన జరిగిన ఈ సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కడప డిఎస్‌పి షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్నేహితుడు తీసుకున్న రూ.15 లక్షల అప్పునకు శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి పూచీకత్తుగా ఉన్నారు. అప్పు తీసుకున్న స్నేహితుడు తిరిగి చెల్లించకపోవడంతో రుణ దాతలు శ్రీకాంత్‌రెడ్డిని అడిగారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో శ్రీకాంత్‌రెడ్డి మృతి చెందారు. ఆధారాలు లభించకూడదన్న ఉద్దేశంతో మృతదేహంపై పెట్రోలు పోసి తగులబెట్టారు. ఈ ఘాతుకానికి పాల్పడిన అండ్లురూ చైతన్య కుమార్ రెడ్డి, అవ్వారు శ్రీలీల, మద్దాల చాముండేశ్వరి, సోమ శివ ప్రశాంత్ యాదవ్, జకట ఉదయ్ కిరణ్, సింగనమల వెంకటసాయి, కాకి మోహన్ చంద్రను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితుల్లో ఇద్దరు మహిళలున్నారని చెప్పారు. నేర సమయంలో ఉపయోగించిన 03 మోటార్ సైకిళు, 7 సెల్ ఫోన్లు, 2 కట్టెలు, క్రికెట్ బ్యాట్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కేసును ఛేదించిన చింతకొమ్మదిన్నె సిఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ అరుణ్ రెడ్డి, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

హాజిల్‌వుడ్ ఔట్

- మైకల్ నెసర్ ఇన్

లండన్ : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ముందు ఆసీస్‌కు ఎదురుదెబ్బ. ఐపీఎల్‌లో గాయపడిన జోశ్ హాజిల్‌వుడ్ ఫైనల్ పోరు సమయానికి పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశం కనిపించటం లేదు. దీంతో హాజిల్‌వుడ్ స్థానంలో ఆస్ట్రేలియా మైకల్ నెసర్‌ను ఎంపిక చేసింది. తుది జట్టులో చోటు కోసం స్కాట్ బొలాండ్‌తో నెసర్ పోటీపడాల్సి ఉంటుంది. కౌంటీ క్రికెట్‌లో జోరుగా వికెట్ల వేట సాగించిన మైకల్ నెసర్.. విదేశీ గడ్డపై టెస్టు అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్‌కు జోశ్ హాజిల్‌వుడ్ అందుబాటులో ఉంటాడని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. జూన్ 16న బర్మింగ్‌హామ్ టెస్టుతో యాషెస్ సమరం ఆరంభం కానుంది.

టేబుల్ టెన్నిస్ టోర్నీ షురూ

హైదరాబాద్ : జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. మోయినాబాద్‌లోని ఫైర్‌ఫాక్స్ స్పోర్ట్స్ అండ్ రిసార్ట్స్ వేదికగా ఈ టోర్నీ మొదలైంది. తెలంగాణ అమ్మాయి అపర్ణ వెల్లూరి ముందంజ వేసింది. 11-7, 11-6, 9-11, 11-9తో బెంగాల్ అమ్మాయిపై అపర్ణ గెలుపొందింది. ఏపీ అమ్మాయి మానస్వి సీలం సైతం రెండో రౌండ్లో అడుగుపెట్టింది. ఉత్తరప్రదేశ్ అమ్మాయిపై 3-2తో ఐదు సెట్ల మ్యాచ్‌లో గెలుపొంది టోర్నీలో ముందంజ వేసింది. ఆరు రోజుల జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో దేశవ్యాప్తంగా 1900 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు.



కడప జీపు జాతాలో మాట్లాడుతున్న ముత్యాలరావు



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో జాతా సభ్యులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

- కొనసాగుతున్న జీపుజాతాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు కార్మికులకు పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి ప్రారంభమైన జాతా కడప మీదగా అన్నమయ్య జిల్లా రాయచోటిలోకి ప్రవేశించింది. జాతా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకోగానే మున్సిపల్ కార్మికులు ప్రచార జాతాలోని రాష్ట్ర నాయకత్వానికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన గీతాలు ప్రజలను ఆలోచింపజేశాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా తూర్పుగోదావరి జిల్లా మీదుగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోకి ప్రవేశించింది. జాతాలకు ఆయా మున్సిపాల్టీల్లో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు ఘన స్వాగతం పలికారు.

తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎపి ఎఫ్ఆర్ఎస్, ఇకెవైసి తదితర పేర్లతో కార్మికులను వేధింపులకు గురి చేయడం తగదన్నారు. జాతాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావుతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య తదితరులు మాట్లాడారు.

కడపలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయ్యాక అమలు చేయడంలో జగన్మోహన్‌రెడ్డి విఫలమయ్యారని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తామని వైసిపి మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. 98 శాతం హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్న నాయకులు, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు ఏ మేరకు అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. రాయచోటిలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.లక్ష్మి నారాయణ, బి.గోపి, ఎటిఎం నాగరాజు పాల్గొని మాట్లాడారు.

'ఆనం'పై దాడికి యత్నం

వైసిపి ప్రయత్నంగా అనుమానం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమాణారెడ్డిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడికి ప్రయత్నించారు. అయన సన్నిహితులు ప్రతిఘటించడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సంఘటన నెల్లూరు నగరంలో ఆదివారం జరిగింది. నెల్లూరు ఆర్‌టిఎ కార్యాలయం రోడ్డులోని ఓ స్నేహితుని ఇంటికి ఆనం వెంకటరమాణారెడ్డి వెళ్లారు. ఆనం అక్కడకు వచ్చారని తెలుసుకున్న కొంతమంది దుండగులు కర్రలతో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించారు. వెంకటరమాణారెడ్డి అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వస్తుండగా కర్రలతో దాడికి ప్రయత్నించారు. ఆనం అనుచరులు అడ్డుకోవడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో ఆనం స్నేహితుడు శికింధర్‌రెడ్డికి స్వల్ప గాయాలు కావడంతో స్థానిక అపోలో ఆస్పత్రికి తరలించారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటరమణారెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దాడిని తీవ్రంగా ఖండించారు. ఇటీవల కాలంలో వైసిపి ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రిపైనా ఆనం వెంకటరమాణారెడ్డి తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు ప్రాంతానికి చెందిన కొందరు దుండగులు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీని వెనుక వైసిపి నేతలు ఉన్నారని టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నాయకులు అచ్చెన్నాయుడు, బీద రవిచంద్ర, తదితరులు ఫోన్‌లో పరామర్శించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆనం స్నేహితుడిని పరామర్శిస్తున్న టిడిపి నేత సోమిరెడ్డి

ఆనం రమణారెడ్డిపై దాడి దుర్మార్గం

- ఖండించిన చంద్రబాబు, టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నేత ఆనం వెంకట రమణారెడ్డిపై జరిగిన దాడిని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడి ఘటనపై ఆనంకు ఫోన్ చేసి వివరాలను చంద్రబాబు తెలుసుకున్నారు. రౌడీయిజం ద్వారా తనను ప్రశ్నించే వారిని భయపెట్టాలని సిఎం జగన్ చూస్తున్నారని, ఇది సిగ్గుపడాల్సిన విషయమని విమర్శించారు. జగన్ అప్రజాస్వామిక విధానాలకు ప్రజలు త్వరలో చరమగీతం పాడబోతున్నారని తెలిపారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే దాడులకు పాల్పడటం అనాగరికం, అప్రజాస్వామికమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో పేర్కొన్నారు. దాడిచేసిన నిందితులను అరెస్టు చేయాలని, ఆనంకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆనంపై దాడి దుర్మార్గమని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు మరో ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతున్నారన్న కక్షతోనే దాడికి పాల్పడ్డారని విమర్శించారు.



పోటీలకు సిద్ధమవుతునన బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్ జట్లు

ఉత్సాహంగా ఉమెన్ టి20 లీగ్

- బోణీ కొట్టిన విజయనగరం రాయల్స్, బెజవాడ బ్లేజర్స్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం సమీపంలోని చింతవలసలో పివిజి రాజు క్రికెట్ అకాడమీలో ఎసిఎ ఉమెన్ టి20 క్రికెట్ లీగ్ ఆదివారం ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ఉదయం జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ క్వీన్స్‌పై బెజవాడ బ్లేజర్స్ జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. బెజవాడ జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 127 పరుగులు చేసింది. రాయలసీమ క్వీన్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 113 పరుగులు మాత్రమే చేయగలిగింది. బెజవాడ జట్టులో వాసవి అఖిల్ పావని నాలుగు వికెట్లు పడగొట్టింది. మధ్యాహ్నం విజయనగరం రాయల్స్, వైజాగ్ డాల్ఫిన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది.

వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 12.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. మ్యాచ్ మధ్యలో వర్షం కురవడంతో మ్యాచ్‌ను నిలిపేశారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం... విజయనగరం రాయల్స్ జట్టు 12 ఓవర్లలో 85 పరుగులు చేసి విజయం సాధితంచింది. మ్యాచ్‌కు ముఖ్యఅతిథులుగా ఎసిఎ సిఇఒ శివారెడ్డి, సహాయ కార్యదర్శి ఎ.రమేష్, విజయనగరం జిల్లా కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ఎసిఎ మేనేజర్ డి.నాగేశ్వరరాజు, నార్త్ జోన్ అకాడమీ చైర్మన్ జివిఎస్ఎన్ రాజు, నార్త్ జోన్ కన్వీనర్ పివి దేవవర్మ, బ్రాండ్ అంబాసిడర్ రష్మి గౌతమ్ హాజరయ్యారు.



చెక్కు అందుకుంటున్న బెజవాడ బ్లేజర్స్ జట్టు కెప్టెన్

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 5 జూన్ 2023



"జాతీయత పేరిట శక్తి
జలిపింపులకు దిగకూడదు.
సమస్త మానవ కోటిది
ఒకే సంస్కృతి."

- శ్రీశ్రీ

పతకాలు తెచ్చిన ఆమెల కన్నీటి పద్యం

అఘాయిత్యయత్నం చేసారనీ ఆడపిల్ల
గల్లీలో కాదు; ఢిల్లీలో గొంతెత్తుతున్నది
సాక్ష్యం చూపించమన్నాడు కుపురుషుడొకడు
ఆ ఆడపిల్లలే వాడిపిల్లలైతే అదే కూత కూస్తాడా?
వాళ్లనోనాడు పలక ముట్టొద్దని నిషేధించాం
చదివే వోణిలు వాణివైపు నడిస్తే చెడిపోతామన్నాం
ఒక స్త్రీ బాలికాక్షరాలు నేర్పిస్తే పేడనీళ్లు పోశాం
ఛాందసాల్ని ఆధునిక మంటల్లో తగలేస్తూ
ఆడపిల్లలు అంతరిక్షంలోకి దూసుకెళ్తున్నప్పుడు
బూడిదయ్యాక కూడా ఛాందసులు మాట్లాడుతున్నారు

దారిలో పోతుంటే అదోలా చూసేవాడొకడు
బస్సులో వెళ్తుంటే భుజాలపై చేతులేసి వేధించేవాడొకడు
నమ్మించి మోసగించేవాడొకడు
ప్రేమవుచ్చులోకి దింపి చచ్చు బతుకు చేసేవాడొకడు
ఆడలేడిపిల్లల చుట్టూ కబళించే మగపులులెన్నో..!
వలపుబువ్వ పెట్టలేదని సైకోలా మారి
సిగరెట్టు వాతల హింసకు పాల్పడతారు
అనుమానం వస్తే చాలు, విడాకులిచ్చి
ఒంటరి వెతలవూబిలోకి దింపేస్తుంటారు
వేరొకడితో మాట్లాడిందనీ నలభై ముక్కలుగా
పడతిని పడగొట్టి నరికేసేవాళ్లున్నారెందరో...

అర్ధరాత్రి ఆడవాళ్లు తిరిగే స్వేచ్ఛా!?
పగలే నట్టనడివీధిలో ఆమెల్ని చెరబట్టే కాలమిది
చెరబడుతుంటే చోద్యం చూసే లోకం యిది
చెరబట్టారనీ ఆవేదన పడినా హక్కుల్లేవు
ధనికుల నేరాలకు కాపుగాసే చట్టాలున్న ఈ మట్టిపై
బీదబిక్కి స్త్రీబిడ్డల కన్నీటిని తుడిచే చట్టమేదీ!?

దేశం నా భరతమాత ఒక ఉవిదే
న్యాయదేవత ధర్మదేవత మహిళలే అయినా
పురుషులదే ఆధిపత్యం
పీడితుల పక్షం నిలవని దేశం దేశమా!?
పతకాలు తెచ్చినపుడు దేశం గొప్పన్నావు
వాళ్లు ధైర్యం చేసి లోపల గాయాల్ని బట్టబయలు చేసి
దోషులను పట్టుకుని శిక్షించమని అడిగితే
ఆడవాళ్లు కదా లాఠీలతో అణచివేస్తున్నావూ!?
గద్దెనెక్కిన ఏలికా!?
అమ్మ పాదాలు తడుతుంటావు గదా
వాళ్లూ కాబోయే అమ్మలు
మీ అమ్మనే అయితే ఏం చేస్తావూ!?
తొక్కి పడతావా!? మొక్కి వాళ్లకు సాయపడతావా!?
అబలల గోడు వైపు చెవియొగ్గినపుడే నీది రాజసం!

– మెట్టా నాగేశ్వరరావు

ఇక్కడ ఆటలు నిషిద్ధం!

ఏళ్లకేళ్లు ఆడవాళ్లు
ఈడ్చుకుంటూ, ఓర్చుకుంటూ
ఒకరినొకరు పేర్చుకుంటూ
ఎర్ర జెండాలతో యుద్ధం చేస్తూ
లాఠీలతో ఎముకలు విరగ్గొట్టించుకుంటూ
బూటు కాళ్ళ కింద నలిగిపోతూ
బూతుల హెడ్ లైన్స్‌లో చోటు దక్కించుకుంటూ
రక్తంలో నానిపోతూ తరాలకు తరాలుగా
స్వేచ్ఛ కోసం సివిల్ డ్రెస్‌లో యుద్ధం చేస్తూనే ఉన్నారు...

రాజులు పోయారు రాజ్యాలు పోయాయి
స్వేచ్ఛ భూస్థాపితమైపోయింది
ప్రభుత్వాలొచ్చాయి... పాలకులొచ్చారు..
పల్లెలు మాయమైనట్టు
స్వతంత్రం కూడా సమాధైపోయింది!
సిగరెట్ పాకెట్ మీద
పొగ తాగడం నిషేధం అని రాసినట్టు....
ఆట వస్తువుల మీద ఆడటం నిషేధం
అనే అక్షరాలు ఇప్పుడు వెక్కిరిస్తున్నాయి...
మైదానాలు కూడా
మగ వాసనకు సలాం చేస్తున్నాయి!
అవును, నా దేశంలో ఇప్పుడు ఆటలాడడం నిషేధం
నోరు తెరవడం నిషేధం
లైంగిక వేధింపులకు లైసెన్స్ ఉన్న నా దేశంలో
ఆధారముందా? అని అడిగే నోళ్ళ ముందు
నా ఆత్మ గౌరవం ఎప్పుడో ఆత్మహత్య చేసుకుంది!
కారణమేదైనా, మగ రాజకీయ చదరంగంలో
ఆడ ఆటగాళ్లకు 'నీయమ్మ, దానెమ్మ' అనే బిరుదులూ..
అప్పుడేమో అశోక వృక్షం కింద ఒకే ఒక సీత
ఇప్పుడు వందల మంది సీతలు...
వేధింపుల ఆరోపణలు నిరూపణ చేయలేక
బలవంతపు పైత్యాలను ఎదిరించి నిలువలేక..!

– అమూల్యచందు, 90598 24800

మసిపూస్తే మాసిపోయేది చరిత్ర కాదు!

సంభవామి యుగేయుగే అంటావు
దైవాన్ని ముక్కలు ముక్కలు చేసి
ఒక్కో ముక్కకు ఒక్కో మతం రంగు పూస్తావు
మతోన్మాదం రగిల్చి విద్వేషం నింపుతావు.
దేవుడి ఉనికిని ప్రశ్నార్థకం చేస్తావు!
సీత కన్నీరు ఎంత విధ్వంసం సృష్టించిందో?
ద్రౌపది విడిన కొప్పు సార్వభౌముడి తొడలెలా విరగ్గొట్టిందో?
పురాణాలు ప్రవచిస్తావు! అంతస్సారాన్ని అంగీకరించవు!
ఝాన్సీరాణి పోరాటమే తెల్లదొరల అంతానికి
తొలి కొరడాదెబ్బ అయిందని చదవలేవు!
మాంచాల, మల్లమ్మ, నిర్మలమ్మ
చరిత్రలో మండుతున్న నిప్పురవ్వలు!
భేటీ బచావో అని వాక్రుస్తావ్!
ముగురమ్మల్ని పదేపదే స్తుతిస్తావ్!
శక్తిస్వరూపులై దేశానికి పతకాలను కొల్లగొట్టి తెచ్చిన
మహిళా రెజ్లర్లను బూటుకాలు పెట్టి అదుముతావ్!
పతకాల కన్నీటితోనైనా మతకలుషితగంగ
పవిత్రీకృతం అవుతుందా?
ఆర్యావర్తం విద్వేషపు విషం నుంచి ఒడ్డెక్కుతుందా?
గుర్తుందా? హిట్లర్, ముసోలినీల అంతిమ పయనం!
మసిపూస్తే మాసిపోయేది చరిత్ర కాదు!
కళ్ళుమూసుకొని పిల్లి పాలుతాగితే
పడాల్సిన వేటు పడకమానదు!
కాల గమనం ఆగిపోదు!

– గార రంగనాథం, 98857 58123

24, 25 తేదీల్లో కథా కార్యశాల

నూతన తరం రచయితలను, అనువాదకులను తయారు చేయాలన్న సంకల్పంతో జూన్ 24, 25 తేదీల్లో సమన్విత, సేఫ్, జి.ఆర్.కె – పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా చిన ముత్తేవిలో కథా కార్యశాల నిర్వహిస్తున్నాం. ఆసక్తి గల యువ రచయితలు, రచయిత్రులూ ఈనెల 10వ తేదీ తమ పేర్లు నమోదు చేసుకొని ఈ కార్యశాలకు హాజరు కావొచ్చు. ప్రముఖ రచయత ఖదీర్ బాబు, ఇతర సీనియర్ రచయతల సారథ్యంలో కథారచనపై శిక్షణ ఉంటుంది. ఈ కార్యశాల అనంతరం ప్రతినిధులు రాసే కథలతో ఒక సంకలనం వెలువరిస్తాం. ఈ కార్యశాలకు వచ్చేవారు రూ.100 ప్రవేశ రుసుం చెల్లించాలి. రెండు రోజులూ భోజనం, వసతి ఏర్పాట్లు ఉంటాయి. మరిన్ని వివరాలకు శాంతిశ్రీ 8333818985, శమంతకమణి 9491962638, ఉషారాణి 9492879210 లను సంప్రదించాలి.

– సమన్విత

తొలితరం దళిత సంస్కృత పండితురాలు

"కులం ఒక మానసిక రోగం. 'మేము కులతత్వాన్ని పాటిస్తాం, అంటరానితనాన్ని ఒక సంప్రదాయంగా అనుసరిస్తాం, ఎందుకంటే మా మతం మాకు అలా చేయమని చెప్పింది' అంటారు ఆ మతస్తులు. కానీ చేదు ఎప్పటికీ తీపి కానేరదు. కాలకూట విషం ఎప్పటికీ తేనెలా మారదు."

- డా. అంబేద్కర్.



అవి, కులవివక్ష జడలు విప్పుకుని నర్తిస్తున్న రోజులు. దేశ నాయకులని పేరు పడ్డ పెద్ద పెద్ద నేతలంతా దేశ స్వాతంత్ర్యం కోసం గట్టిగా పోరాడుతున్న సాంస్కృతిక చైతన్య ఘడియలవి. ఒక పక్క అంటరానితనాన్ని, దైవాజ్ఞగా కొన్ని పేద సమూహాలకు ఆపాదించి, వారిని ఊరికి దూరంగా పారదోలి, జంతువులకన్నా హీనంగా పరిగణిస్తూ, మళ్ళీ వారితో ఇంటా బయటా చెప్పరాని రీతిన ఉచిత చాకిరీలు చేయించుకుంటూ కూడా కడుపునకు ఇంత తిండిపెట్టకుండా, బ్రాహ్మణ ఆధిపత్యం షెడ్యూల్డ్ కులాలను కట్టుబానిసలుగా చేసి హింసిస్తూ, మనుస్మృతిని అమలు చేస్తున్న బాధాకరమైన పరిస్థితులవి.

దళితేతర స్త్రీ విద్య కూడా నిషేధంగా ఉన్న రోజులు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆధునిక ఆలోచనా విధానం దళితుల్లో ఆశను, మనువాద పెద్దల్లో భయాన్ని కలిగిస్తున్న, ఒక ట్రాన్సషన్ పీరియడ్. ఆ సమయంలో 1938లో మహారాష్ట్ర, నాగపూర్‌లో ఒక అంటరాని మహర్ కుటుంబంలో జన్మించింది కుముద్ సోంకువార్. కటిక పేదరికం లేకున్నా, అంటరాని ఆడపిల్లగా ప్రతిచోటా అవమానాలు చవిచూసింది. బడికి వెళ్లి చదువుకోవాలనే బలీయ కాంక్ష, తరగతిలోని బ్రాహ్మణ, ఇతర అధిపత్య విద్యార్థుల హేళనాపూరిత వ్యాఖ్యల్ని అధిగమించేలా చేసింది. కుముద్ తండ్రి వకీలు, తల్లి కూడా జ్ఞానవంతురాలు. సామాజికంగా కాస్త బావున్న కుటుంబం అయ్యేసరికి కుముద్ చక్కటి బట్టలు వేసుకొని, శుభ్రంగా ఉండేది. తోటి విద్యార్థుల ఇళ్లకు ఆడుకోవడానికి వెళ్ళిన ప్రతిసారీ కుముద్‌కు అవమానాలే ఎదురయ్యాయి.

చూడ్డానికి ఎంతో ఉన్నతస్థాయిలో కనిపించే పెద్ద కులాల స్త్రీలు, కుముద్‌తో తమ కూతుళ్ళని ఆడనిచ్చేవారు కారు. "ఆ అమ్మాయి అంటరానిది, తనను తాకకూడదు, తాకావంటే ఇక ఇంటికి రానివ్వను" అంటూ ఆ పసి మనసులను తల్లులే విషపూరితం చేయడం చూసిన కుముద్ మనసు వికలమయ్యేది. "నేను ఇంత శుభ్రంగా ఉంటే కూడా నేను అంటరానిదాన్నేనా? నిజానికి వాళ్ల ఇళ్ళే అశుభ్రంగా ఉంటాయి. ఐనా వాళ్ళు మనల్నే మైల అంటున్నారు." అని ఆలోచించేది.

ఒకసారి సహధ్యాయి సోదరుడి ఉపనయన కార్యక్రమాన్ని కిటికీగుండా చాటుగా చూస్తున్న చిన్నారి కుముద్‌ను, ఆ ఇంటి యజమానురాలు కోపంగా అదిలించిందట. "నీకేమైనా అర్థమవుతుందా, సంస్కృతం? మీ మహర్లకు ఈమధ్య కళ్ళు నెత్తికెక్కుతున్నాయి. ప్రభుత్వాలు మిమ్మల్ని అలా అందలాలు ఎక్కించి చెడగొడుతున్నాయి." అంటూ చిన్నారి కుముద్‌ను వెళ్లగొట్టిందట. "నేను చూడడం వల్ల ఇక్కడ ఎవరికైనా గాయాలయ్యాయా? ఎందుకు తిడతారు" అంటూ ఇంటిదారి పట్టిన కుముద్ ఆ వెంటనే బడిలో సంస్కృతం ప్రధాన సబ్జెక్టుగా తీసుకుని చదవడం ప్రారంభించింది.

కుముద్‌తో క్లాసులో మిగతా పిల్లలు మాట్లాడకపోయినా, అకుంఠిత దీక్షతో మెట్రిక్యులేషన్ పూర్తి చేసింది. క్లాసులోని బ్రాహ్మణ్య టీచర్లు ఎగతాళి చేసినా పట్టించుకోలేదు. ఆపై సంస్కృతంలో బియ్యే, ఎమ్మే కూడా చదవాలనుకొని కళాశాలలో చేరింది. ఆసక్తికరంగా కొందరు సొంత కులాల మేధావులు తనను తేలిగ్గా మాట్లాడారని, ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉంటే మంచిదని ఉచిత సలహాలు ఇచ్చేవారని, అలాగే హాటేకర్ అనే ఉపాధ్యాయుడు, తనకు సంస్కృతం బోధించిన గోఖలే అనే బ్రాహ్మణ ఉపాధ్యాయుడు తనను ఎంతో ప్రోత్సహించారని, గోఖలే గారైతే ఇంటికి పిలిచి మరీ కష్టంగా ఉన్న పాఠాలను బోధించి, తాను మంచి మార్కులు తెచ్చుకునేలా దోహదపడ్డారనీ, 'అంత్జస్ఫోట్' అనే తన స్వీయకథలో వివరిస్తారు కుముద్.

ఆపై సంస్కృత భాషలో బియ్యే, ఎమ్మే కూడా డిస్టింక్షన్‌లో పూర్తి చేసిన కుముద్‌కు, ఉద్యోగం మాత్రం దొరకడం కష్టం అయింది. "చదవడం ఐతే చదివావు గానీ, ఒక అంటరాని మహిళ దగ్గర సంస్కృతం నేర్చుకోవడానికి ఎవరు వస్తారు? సంస్కృతం దేవుళ్ళ భాష. అది అంటరానివారు నేర్చుకోవడం విడ్డూరం" అంటూ ముఖమ్మీదే ద్వేషం చిమ్మే ఎందరినో కుముద్ ఎదుర్కోవాల్సి వచ్చింది. నాగపూర్ యూనివర్సిటీలో ఎంతో మోడర్న్‌గా కనిపించే ఒక బ్రాహ్మణ ప్రొఫెసర్, తనను చూసినపుడల్లా పైకి తీయగా మాట్లాడుతూనే లోలోపల అయిష్టత ప్రదర్శించేవారనీ, విశ్వ మానవత్వాన్ని పాఠాల్లో గొప్పగా చెప్పినా, ఆచరణలో ఎంతో కులవిద్వేషం ఆయనలో కనిపించేదనీ తన ఆటోబయోగ్రఫీలో చెప్పారు కుముద్.

ఐతే, తాను డిస్టింక్షన్‌లో పాసైనందుకు నాగపూర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సెలర్ డా.కొల్తే, పూలబొకేతో అభినందనలు పంపారనీ, కానీ, ఆపై తాను ఎన్నో ఇంటర్వ్యూలకు హాజరైనా, తనను ఉద్యోగంలో పెట్టుకోవడానికి ఎవ్వరూ ఇష్టం చూపలేదనీ, కొందరు షెడ్యూల్డ్ కులాల మేధావులు కూడా తనను కించపరుస్తూ మాట్లాడారనీ వివరించారు కుముద్. చదువు పూర్తయి రెండేళ్లయినా ఉద్యోగం రాకపోయేసరికి, ఏకంగా కేంద్రమంత్రి గారికే ఉత్తరం రాశారు కుముద్. స్వతహాగా ధైర్యవంతురాలైన ఆమె, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ కాబినెట్లో మంత్రిగా ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ గారికి తన పరిస్థితి వివరిస్తూ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వమూ, పాలనా వ్యవస్థా కలిసి రాజ్యాంగ విరుద్ధంగా తన విషయంలో వ్యవహరిస్తున్నాయో వేదనాభరితంగా వివరించారు ఆ లేఖలో.

జగ్జీవన్ రామ్ ఆ లేఖను ప్రధాని పండిట్ నెహ్రూ ముందు పెట్టగా, ఒక షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతికి గల పట్టుదల చూసి ఆశ్చర్యానికి లోనై, ఆమెకు రూ.250ల నగదు బహుమతిగా పంపడంతో పాటూ, మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలవమని ఉత్తరం రాశారు. అప్పటి మహారాష్ట్ర సీఎం యశ్వంత రావు చవాన్ కుముద్‌కు టెలిగ్రామ్ ఇచ్చి పిలిపించుకుని, "త్వరలోనే మీకు ఉద్యోగం ఏర్పాటు చేస్తాను. ఐతే నిముషాల్లో ఏదీ జరగదు కదా. కాస్త సమయం పడుతుంది. ఈలోపు పరిశోధక విద్యార్థిగా చేరండి" అంటూ ఆమెను నిలబెట్టి ఉపన్యాసం ఇచ్చినపుడు, "సాబ్, మీరు ఇవ్వలేనపుడు ఇవ్వలేను అని చెప్పండి. శుష్క వాగ్దానాలు నాకు అవసరం లేదు. బతుకుదెరువు లేని నేను, పరిశోధన ఎలా చేయగలను?" అని చెప్పి, నిరాశతో తిరుగు ప్రయాణమౌతుంది.

ఒక దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ఒక అంటరాని యువతికి అన్ని అర్హతలూ ఉన్నా, ఉద్యోగం ఇవ్వలేకపోయారూ అంటే మనం అర్థం చేసుకోవచ్చు... కులవివక్ష ఏ స్థాయిలో మన భారతదేశాన్ని ఆరోజుల్లో ఆవహించి ఉందో! ఐతే, కుముద్ ఎలా నాగపూర్ యూనివర్సిటీలో సంస్కృత విభాగాధిపతిగా రిటైరయ్యారు? ఎలా ఆమె ఆమె ఎంతో ప్రేమించిన సంస్కృత భాషను కాలేజీల్లో బోధించారు అనే అనుమానం రాక మానదు కదా? కుముద్ ఆపై ఖాళీగా ఉండలేక ఎమ్మే ఇంగ్లీష్ చదవడానికి పూనుకున్నారు. ఆ ఏడాది ఆమె వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం. వివాహమైన రెండు నెలలకే నాగపూర్ ప్రభుత్వ కళాశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. ఇంటర్వ్యూ బోర్డులో ఉన్న డైరెక్టర్ సహస్రబుద్ధే ఆమెను చూడగానే ఉద్యోగానికి సెలెక్ట్ చేశారు. ఆపై నాగపూర్ యూనివర్సిటీలో అనతికాలంలోనే కుముద్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం తెచ్చుకున్నారు.

ఐతే కుముద్ అంటారూ, "నేను కుముద్ సోంకువార్‌గా ఉన్నంతసేపూ నాకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదు. కుముద్ పావడే అయ్యాక, ఉద్యోగాలు నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. పెద్ద కులపు భర్త ఇంటిపేరు తనపేరును మాత్రమే కాక, కులాన్ని కూడా మార్చేసిందని, తాను ఎంత శ్రమించి డిగ్రీలు తెచ్చుకున్నా, తాను అంటరాని స్త్రీగానే లెక్కించబడ్డానని, కాబట్టే బ్రాహ్మణ్య ఆధిపత్య విద్యారంగంలో తనకు చోటు విస్మరించబడ్డదనీ, తన భర్త యొక్క ఆధిపత్య కులపు పరపతి వల్ల తన అంటరానితనం దాచబడి తనకు ఏమాత్రం కష్టం లేకుండా ఉద్యోగం వచ్చిందనీ, భారతదేశంలో ప్రతిభకు కూడా కులం ఉందని, అంటరాని కులస్తులలో ఎంత ప్రతిభ ఉన్నా, వారిని కుట్రపూరితంగా ఆధిపత్య శక్తులు తొక్కిపెడుతున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు తన స్వీయ చరిత్రలో.

విద్యావేత్త, అలనాటి ఆధిపత్య పీఠాధిపత్యాన్ని తన జ్ఞానంతో సవాలు చేసిన భారతదేశపు మొట్టమొదటి దళిత సంస్కృత పండితురాలు కుముద్ పావడే ఈనెల (జూన్) ఒకటో భౌతికంగా మరణించారు. విద్యావేత్తగానే కాక, సామాజిక వేత్తగా కూడా కుముద్ ప్రభావవంతమైన జీవితం జీవించారు. దళిత స్త్రీల అభ్యున్నతి కోసం చీఖీణఔ అనే సంస్థను స్థాపించి, సేవలందించారు. నిచ్చెనమెట్ల భారత సామాజిక వ్యవస్థలో, స్త్రీలకు ఏ మాత్రం స్థానం లేని కులవ్యవస్థ పాలనలో, ఒక దళిత మహిళయయ్యుండీ బ్రాహ్మణుల భాషగా చెప్పబడ్డ సంస్కృతాన్ని కష్టపడి చదివి, పట్టుదల, దీక్ష ముందు కులం, మతం నిలబడలేవని నిరూపించిన ధీర వనిత పండిత కుముద్ పావ్డే. వీరినుంచి యావత్ స్త్రీ జాతి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఎంతో ఉంది. ముఖ్యంగా రకరకాల పితృస్వామ్యాల పీడన కారణంగా చదువులో ఇంకా వెనుకబడి ఉన్న దళితవాడల ఆడపిల్లలు, ధీరవనిత కుముద్‌ను ఉదాహరణగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం ద్వారా కులపు కోటను బద్దలు కొట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

– అరుణ గోగులమండ
సామాజిక విశ్లేషకురాలు, 88971 07984

నీటి గింజల గానం కంచరాన కవిత్వం

మీతూకపురాళ్లతో మీరు బేరీజు వేస్తారు కదా? అని భుజంగరావు తన కవితా సంపుటిలో అడుగుతున్నాడు. ఇంత వినమ్రంగా అడుగుతున్నా డంటే- ఈ కవి నేర్చుకోవడానికి, మరింత అధ్యయనం చేయడానికి సిద్ధంగా ఉన్నాడని అర్థం. అంతకుముందు కవిత్వం అనుభూతిపూర్వకంగా ఉండేది. ఆ తర్వాత సామాజిక పరిణామం, చైతన్యం, ప్రజాస్వామీకరణ చెందింది. ఏది ఉత్తమ కవిత్వం అనే ప్రశ్నకు ఎవరి వాదనలు వాళ్లకు ఉంటాయి. బౌద్ధికమైన కవిత్వమే కవిత్వం అని కొందరు నిర్ధారించుకున్నారు. కాదు, సమాజాన్ని కాదని నువ్వు ఏం రాస్తావు అని మరికొందరు ఆ విధానంలో సాగిపోతున్నారు. ఈ రెండిటినీ మేళవించి రాసుకుబోయే కవులూ ఉన్నారు. మానవ జీవితంలోని అన్ని కోణాలు మనకు తెలియాలంటే, అన్ని ఉద్వేగాలని మనం సజనాత్మక ప్రక్రియలోకి తీసుకురావాల్సిందే! అయినప్పటికీ వివిధ కారణాల వల్ల కవిత్వం చదివే వారి సంఖ్య తగ్గిపోతుంది అనే సత్యాన్ని ఒప్పుకు తీరవలసిందే!

ఇలాంటి సందర్భంలో 'నీటి గింజల పంట' అంటూ ఉత్తరాంధ్ర నుంచి భుజంగరావు కవిత్వ దిగుబడిని పుస్తకంగా తీసుకొచ్చారు. ఈ పుస్తకంలో కవిత్వం వయసు 17 ఏళ్లు. మరి ఇంతకాలం తాను పుస్తకం వేయలేదా అంటే- ఒక దీర్ఘ కవితను, నానీలు పుస్తకాన్ని తీసుకొచ్చాడు. నిశ్శబ్దంగా ఉంటూనే సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ వచ్చాడు. రెండు మూడేళ్లగా భుజంగరావు వాక్యం పత్రికల్లో, వెబ్ మ్యాగజైన్లలో మనం చదువుతూ ఉన్నాం. అన్నం పెట్టే రైతు, మొలిచే మట్టి, కష్టాల్లో ఉన్న సేద్యం, ప్రపంచీకరణ, జీవవైవిధ్య పరిణామాలు, ఉత్తరాంధ్ర వలస దు:ఖం, అధ్వానం అయిన ఉద్దానం జీవితం, కొంత వైయక్తిక జీవితం... తన కవితల్లో దర్శమిస్తాయి. సాహిత్యానికి, జర్నలిజానికి తేడా ఉంటుంది. నువ్వు చెప్పదలుచుకున్న అంశానికి సరైన వ్యక్తీకరణ, అనుభవం, అది పాఠకుల్లోకి ప్రసారం కాగలిగే శక్తి లేనప్పుడు కవికి పాఠకుడికి మధ్య బంధం ధ్వంసం అయిపోతుంది. కవి వాక్యం మనలో ఉద్వేగం కలిగించకపోతే, అక్కడ కవి విఫలం అయినట్టే!

ఈ కవి ఈ దేశ అమృతోత్సవ వేళ అసలు నిజాన్ని నిజాయితీగా కవిత్వీకరించే ప్రయత్నం చేశాడు. ఈ దేశ నాయకుడు ప్రతి ఇంటిపైన జెండా ఎగరాలి అనే పిలుపు ఇచ్చినప్పుడు భుజంగరావు కొన్ని ప్రశ్నలను ఎగరేస్తున్నాడు. ఈ దేశంలో సూర్యోదయం, అనంతమైన భరోసా, ఉదయాల కోసం ఎదురుచూపులుగా సామాన్యులు కరిగి పోవడాన్ని ప్రశ్నిస్తున్నాడు. ఈ దేశాన్ని కమ్మేసిన నీడ గురించి పరిశీలించమంటున్నాడు. ఆ నీడ ఎక్కడెక్కడికి వ్యాపించిందో వ్యాపించిన చోట ప్రజల బతుకులు ఏమయ్యాయో గమనించమంటున్నాడు.

"పెట్టుబడి ఒక్కటే/
వీసాలేకుండా దేశాలు తిరిగేస్తుంది
ఈ గడ్డమీద పెట్టుబడికి ఉన్నంత స్వేచ్ఛ
వేరే ఎవరికైనా ఉందంటారా?"

ఈ వాక్యాల్లో పెద్ద అలంకారికత ఉండక పోవచ్చు. ఒక చిన్న ఊహ ఉంది. అయితే ఆ ఊహలో వాస్తవికత ఉంది. ఎవరికి స్వేచ్ఛ ఉందో,



దేనికి స్వేచ్ఛ ఉందో చెప్పడం ద్వారా ఈ కవిత ఒక బలమైన కవితగా నిలబడింది. భుజంగరావు ఈ కవిత ద్వారా ఏదైతే ఆశించాడో పాఠకుడిగా నేను దాన్ని పొందగలిగాను.

"ఇప్పుడిక దేశభక్తి అంటే
తిరంగా సెల్ఫీ కాదు సామి
రెక్కల మీది వివక్ష బరువుతో
తరాలుగా కూలబడిన పిట్టలకు
రెక్క విదిల్చే తెగువనివ్వడం" 75 ఏళ్లుగా ఈ ప్రశ్నలను అనేకమంది కవులు వేస్తూనే ఉన్నారు. ఈ కవి స్పందించిన సందర్భం వేరు. పెట్టుబడికి ఉన్నంత స్వేచ్ఛ, సామాన్యులకు లేకపోవడం అనే ఆలోచన ఈ కవి చేయడం కొత్తచూపుగా అనిపిస్తుంది. ఇలాంటి లక్ష్యం కలిగిన మరో కవిత "అమృతమెవరికి?". ఈ కవితకు ఆత్మ లాంటి వాక్యాలు ...

"రాజ్యాంగ పీఠిక మీద
పీఠమేసి కూర్చున్న ఐరావతం
మహాసంపన్న కుటుంబాల వ్యాపార
కల్పవృక్షాల కిందకి కామధేనువయి
కదిలిపోతుంది" అని చెప్తూ చిన్న గొట్టంతో బస్తా పొట్టలోకి పొడిచి, కొన్ని కేజీల బియ్యం కాజేసినంత లాఘవంగా ఈ దేశపు బడ్జెట్ దేహం నుంచి నేరుగా కొన్ని జలగలు, ఈ దేశపు సామాన్యుల చెమట, నెత్తుర్ని పీల్చి, కులం పేరుమీద ఓటు తరలి పోవడాన్ని గుర్తించమంటాడు.

'రెయిన్ బో సర్పెంట్' కవితలో కవి చేసిన ఊహలు పాఠకుణ్ణి మెప్పిస్తాయి. జీవపరిణామ క్రమాన్ని చెప్పుకు పోతూ, డబ్బు చుట్టూ మనిషే కాదు, భూమే తిరుగుతోందని అంటాడు.

"సృష్టిలో మొట్ట మొదటి నాణెం లాంటి
ఒక జీవి ఉద్భవించే ఉంటుంది
అందుకే ఇప్పుడు, విశ్వమంతా కరెన్సీ
వాసన" అంటాడు.

ఈ కవి అభివృద్ధి సాకులో జరిగే విధ్వంసాన్ని గురించి రాశాడు. స్త్రీ అస్తిత్వాన్ని గుర్తించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తాడు. జీవితం ఊపిరి బొట్ల కానుక అనే ఆశావహ దృక్పథాన్ని తీర్మానిస్తాడు. 21వ శతాబ్దపు పౌరుడిగా యుద్ధాన్ని నిరసించాలని పిలుపునిస్తాడు. దేహం ఒక మట్టిపోర, మనసు ఒక గాలిపొర అని తత్వాన్ని బోధిస్తాడు. చెమటను నిషేధించేద్దాం అని ఒక విరోధ భాసని వినిపిస్తాడు. కవిత్వమే నా కుడిచేయని ప్రకటిస్తాడు.

"పెరట్లో చింతచెట్టు" కవిత పురాజ్ఞాపకాల కలబోత. ఎత్తుగడలో లినేయషన్ కొద్దిగా జాగ్రత్తగా చేసి ఉండాల్సింది. ఆ కవితలో చేసిన ఊహలు బావున్నాయి. మబ్బుల కొంగుపట్టుకుని ఆకాశాన్ని ఈడుకొచ్చే పిట్టలు మా చూపుల్ని ఎత్తుకుపోయి కొమ్మలపై వాలేవి, కొండరాళ్ల నీడ చెరువులో అలలకు కొత్త కొమ్మల్ని మొలిపించడం ... వంటి వాక్యాలు కవితకు బలాన్నిచ్చాయి. వైయక్తిక అనుభవాన్ని శక్తివంతంగా ఎలా చిత్రీకరించవచ్చో చెప్పటానికి ఈ కవిత ఒక ఉదాహరణ.

ఇవాళ వర్చువల్ జీవితం మనిషిని ఎంత ఒంటరి చేసిందో 'వర్చువల్ వాగులో ఒంటరి పక్షి' కవితలో సమర్థవంతంగా చిత్రీకరించాడు. ప్రళయానికి ముందుమాట, పచ్చందనాలు గెలుపు లాంటి కవితల్లో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశాడు. స్త్రీ గురించి చెబుతూ, ఆమెలో అమ్మతనాన్ని, అందులోని ప్రేమ సముద్రాన్ని తలచుకుంటూ అలల ఆటబొమ్మలతో తీరం పిల్లను లాలిస్తుందని అనడం కొత్తగా ఉంది.

"ఈ తలకిందులు ఛట్రంలో
పాలితులంటే నిర్వాసితులే
ప్రతి సెంటు పచ్చని పంట భూమి
ఏదో ఒక కొత్త ప్రాజెక్టు కింద
అస్తిపంజరమే!" అని నిర్ధారిస్తూ తలకిందుల స్వర్గాన్ని పట్టి చూపుతాడు. నాన్నను చెమటపూల చెట్టుగా. తన ఊరును మట్టి గంగలో ఓటి పడవగా పాఠకుల ముందు నిలుపుతాడు.

ఈ కవికి కొత్త పదబంధాలను ప్రయోగించాలనే తహతహ ఎక్కువ. వెన్నెల పిడికిలి, గొడ్డు మేఘం, మేతకొచ్చిన మేఘం, ఉగ్గుచుక్కల ఊట, మట్టి పొద్దులు, పదాల ప్రయోగశాల, పాలకంకుల పాట, పదాల పసరు, డిజిటల్ వాన, వర్చువల్ వాగు, శాఖ శకం, సుగంధాల పడవలు, ఊపిరి గుట్ట లాంటి కొన్ని పదాల్ని ఈ పుస్తకంలో చూడొచ్చు. పదాల వ్యామోహం కొన్నిచోట్ల పఠనీయతకు అడ్డు తగలడం కూడా మనం గమనించవచ్చు. కుర్ర కాలువ, కుర్ర నవ్వులు, కుర్రవీధులు, కుర్ర పున్నమి వంటి పదబంధాల్లో కుర్ర పదాన్ని రిపీట్ కాకుండా చూసుకోవాల్సింది. మొలక ఇతని అభిమాన పదం. కొన్ని కవితలు ఈ పుస్తకంలో అవసరం లేనట్టు అనిపించాయి.

ఒక పాఠకుడిగా నేను గమనించిన అంశాలు :

1. వస్తువు ఎంపిక సమకాలీనం. దృక్పథంలో స్పష్టత ఉంది. 2. కవిత్వం పట్ల ఆరాధన ఉంది. కవిత్వ నిర్మాణం పట్ల ఎరుక ఉంది. 3. విభిన్నంగా చెప్పాలనే కోరిక అన్వయ దోషాల వైపు తీసుకెళ్తోంది. 4. విశేషాలయి, విషయాలయి వీటిని విశేషాలై, విషయాలై అనడం ద్వారా శిల్పం దెబ్బతినకుండా ఉంటుంది. 5. కవికి స్వీయ నియంత్రణ అవసరమని గుర్తించాలి. ఔచిత్యం అక్కడక్కడ గమనించుకోవాలి.

"ఇది గిజిగాని పచ్చని వెన్నెల గూడు / మాలాంటి చెమట పిట్టలకు / మంటి ఆకాశం."

ఈ విధంగా కవి నీటి గింజల పంట అంటూ మన ముందుకు వస్తున్నాడు. కవిత్వంతోనే తన ఊపిరి వెలిగించుకుంటాడని, కవిత్వంతోనే తన ఆయువు పొడిగించుకుంటాడని ఆత్మవిశ్వాసంతో చెప్పుకున్న కంచరాన భుజంగరావు కవిత్వాన్ని సాహిత్య అభిమానులు, కవులు పాఠకులు ఆదరించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.

– డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

దురాగతాలపై దూసిన కవితాస్త్రం



'నేను ఇక్కడి భూమిని.' ఇది సహజంగానే ఆకట్టుకునే కవిత్వ శీర్షిక. సీనియర్ కవయిత్రి శిలాలోలిత కవిత్వం తిరుగుబాటు తత్వం నేర్పుతుంది. వర్తమాన సమాజంలో తను వీక్షించిన, తన మనసుకు గాయమైన ఘటనలను అనుభవాలను కవిత్వంగా రాసే ప్రగతిశీల కవయిత్రి ఆమె. ఆమె కవితాక్షరాలు పాదరసంలా శిల్పవిన్యాసం చేస్తాయి. కవిత్వం నిండా వర్తమాన సమాజం కనబడుతుంది. దురాగతాలు, దుర్మార్గాలు, బాధలు, కన్నీళ్ళు, నిరసనలు.. అనేకానేక ప్రశ్నలు దర్శనమిస్తాయి. ఏ కవిత రాసినా ఎత్తుగడలోనే కవిత్వం గుర్తుండిపోయేలా పరిమళిస్తుంది. 'అప్పుడప్పుడూ ఇలా మనుషులంతా గడ్డ కట్టుకు పోతుంటారు..'... 'నేను ఇక్కడి భూమిని." కవిత్వ సంపుటిలోని తొలి కవిత 'అరికాళ్ళ మంటలు'లో ప్రారంభవాక్యాలవి.

'అమ్మ చేసిన యుద్ధంలో గెలిచాక/ గర్భ సరస్సు నుంచి జీవన సముద్రంలోకి వచ్చిపడ్డాను/ స్త్రీ అంటే కేవలం ప్రశ్న కాదు/ జవాబై నిలబడి నిలదీసే హెచ్చరిక..' ... ఇలా తొలి కవిత్వ పంక్తులే మననం చేసుకునేలా ఉంటాయి. 'స్త్రీ అంటేనే మహాసముద్రం/ లైంగిక వేధింపుల, వివక్షల రెట్టాలెన్ని వేసినా/ ఆమె మనో నిగ్రహం ముందు/ అనంత ప్రవాహంలో కొట్టుకు పోవాల్సిందే..' ఇలాంటి పదునైన వాక్యాలు, నిప్పుకణికలు ఈ కవిత్వంలో కనబడతాయి.

బేటీ బచావ్, బేటీ పఢావ్ పథకాన్ని ప్రధాన మంత్రి 2015లో ప్రారంభించారు. బిడ్డ ఆడైనా, మగైనా సమానంగా గౌరవించాలనేది మన నినాదం కావాలని, బాలిక పుడితే మనం పండగ జరుపుకోవాలని, కూతురు పుట్టినందుకు మనం గర్వపడాలంటూ ప్రగల్భాల ప్రకటన చేశారు. 'కూతురితో సెల్ఫీ' అని హడావిడి చేశారు. కానీ, ఈ ప్రభుత్వం అభం శుభం తెలియని బేటీ ఆసీఫాను రక్షించలేకపోయింది. శిలాలోలిత 'బేటీ బాచావ్' కవితలో ఇలా చెప్పారు.

"ఆయేషా నుంచి ఆసిఫాదాకా/ గుర్తుంచుకోగలిగామా/ ఇప్పుడు మనమొక్కడున్నామని/ శరీరాలని, మెదళ్ళని, హృదయాన్ని/ కోల్పోయిన వాళ్ళం కదా!/ ఆలోచన మాత్రం బతికున్నవాళ్ళం కదా!/ తెరిచిన కళ్ళల్లో చూపులని బంధించి/ ఘోరాన్ని తెలియనట్టుగా నటిస్తూ/ 'అంతాబానే వుంది' అనుకుంటూ/ బతుకుతున్న వాళ్ళం కదా!/ మన పాప/ మనింట్లోనే భద్రంగా వుంది కదా అదే చాలు/ అనుకునే సర్దుబాటు జీవితాలివి/ చలించం, ఉద్యమించం/ దు:ఖాలనీ, నిరాశలని, చెప్పలేని నిస్సహాయతలని/ కడుపులోనే దాచేసుకున్నాం./ 'ఆల్ ఈజ్ వెల్' అనేసుకుంటూ/ గొప్పగా బతుకును నటిస్తున్నవాళ్ళం కదా!" అంటూ జనం ప్రేక్షకపాత్రను ఆవేదనతో తీవ్రంగా నిరసించారు.

అలాగే, గౌరి లంకేశ్ హత్యోదంతంపై రాసిన కవిత.. 'శిఖరం నేలరాలింది'లో ... "నీకు తెలుసు/ నిజంగా నీకంతా తెలుసు/ ఎవడు దొంగో ఎవడు దొరో/ ఎవరు పీడితులో ఎవరు పీడకులో/ ప్రశ్నించే శిఖరమైనందుకు/ మాటేసి మట్టు పెట్టాడు/ ... నిన్ను భూమి పొరల్లో పాతరేసాననికుంటున్నారు/ రాజ్యమంటే ఇదేనని సవాలు విసురుతున్నాడు/ చిత్రం బహు విచిత్రం/ ధైర్యం ఒరలోంచి నువ్వు విసిరిన అక్షరాలు/ ఊరికే నేలరాలవు నీ నెత్తుటివిత్తనాలు/ మొలకెత్తుతూనే ఉన్నాయి. ఉంటాయి." అని నివాళ్లర్పించారు.

ఈ కవిత్వ సంపుటికి శీర్షికగా నిలిచిన "నేను ఇక్కడి భూమిని" ఇలా సాగింది... : "ఈ భూమ్మీద మనుషులు జీవిస్తున్నారు/ పశుపక్ష్యాదులు, చెట్టూ చేమా/ కలగలిసిన ఒక పండుగ/ ఇప్పుడు మనుషులెవరని ప్రశ్న ఇప్పుడు ఉనికి ఏమిటని ప్రశ్న/ ఇప్పుడు నువ్వెవరని, నేనెవరని ప్రశ్న/ కాలి కింది నేల గురించి ఆరా/ నోటికాడి ముద్ద గురించి అనుమానం/ ... ఎటు చూసినా భయం/ ఎక్కడ నిలబడ్డా హద్దులు/ మనిషిని ప్రశ్నగా మిగిల్చి/ మనిషిని అతలాకుతలం చేసి/ కంచెలు కట్టి, ఆంక్షలు విధించి ఉచ్చులు బిగించి/ ఊపిరాడనీయని రాజకీయ వ్యూహం.." దేశంలోని వర్తమానాన్ని కవిత్వానికెత్తి చూపారు. తరువాత, "వందల ఏళ్ళ అనుబంధం నాది/ నా సంభాషణ ఈ నేలంత పాతది/ ఈ గాలి గుసగుసల్లో, ఈ చెట్టూ చేమా పచ్చదనంలో/ ఈ ఆకాశపు ఆత్మీయులతో నేనూ ఓ భాగం." అని స్పష్టంగా పేర్కొన్నారు. "సరిహద్దులు నిర్మిస్తున్న ఈ మనుషుల/ అసలు అంతరంగ మేమిటి?" అని ప్రశ్నించారు. "ఇన్ని ప్రశ్నల మధ్య – అనుమానాల మధ్య/ ఒకే ఒక్క జవాబు– నేను మనిషిని/ నేను ఆకాశాన్ని/ నేను ఇక్కడ గలగల పారుతున్న సెలయేరును/ నేనే ఈ భూమిని, ఇక్కడి భూమిని." అని కుండ బద్దలు కొట్టినట్టు సమాధానమిచ్చారు. ఎంత గొప్ప స్ఫూర్తి నింపుతుందీ కవిత.

ఈ కవిత్వం స్త్రీ జీవితాన్ని, జీవన గమనాన్ని, సంఘర్షణని, స్త్రీ దు:ఖాన్ని, బాధల్ని ఎలుగెత్తి చాటింది. ఈ కవిత్వంలోని అనేక బలమైన వాక్యాలు నన్నాకర్షించాయి. అవి :

"బీడు బతుకులన్నీ సారవంతమయ్యే/ రోజుల కోసం ఎదురు చూస్తూ చూస్తూ– ఇలా" (యాస్మిన్)

"కొత్త నీటికీ/ కొత్త బతుకులకీ/ కొత్త ప్రేమమయ లోకాలకీ/ మనం కాక ఇంకెవరు పూనుకుంటారు" (నాచు పట్టిన చెరువులు)

"చల్లటి వెన్నెల దేహమంతా స్పృశిస్తూ చెబుతుంది
కాలమెన్ని గారడీలు చేసినా చివరి గెలుపుమనదేనని" (పాఠం)

"స్త్రీ అంటే మానం మాత్రమే కాదు; ఈలోకపు ఆత్మ కూడా" (ఏదైనా చేయాలి)

"అప్పుడప్పుడూ కన్నీళ్ళు వెనక్కుజారి గుండెను నింపుతూ ఉంటాయి (అప్పుడప్పుడూ)

"బిగించిన పిడికిళ్ళను విత్తుతున్నారు అవి తప్పక మొలుస్తాయి" (మీరెప్పుడైనా)

"పురుషాధిక్యం డిసీజ్ కాదు.. అదొక డిజార్డర్" (స్త్రీ–8)

జీవితాన్ని ఉన్నతీకరించడమే సాహిత్యం యొక్క అత్యున్నత కార్యమన్న పాపినేని శివశంకర్ మాట ముమ్మాటికీ నిజమని ఈ కవిత్వం చదివాక మరింత స్పష్టమవుతోంది.

– కెంగార మోహన్
94933 75447



ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థ కలిగియున్న స్టేషన్‌గా పేరుగాంచిన పశ్చిమ బెంగాల్‌లోని బందేల్ జంక్షన్ స్టేషన్‌లోని ఆ వ్యవస్థను పర్యవేక్షిస్తున్న రైల్వే ఉద్యోగి (ఫైల్ ఫొటో)

ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ అంటే ఏమిటి?

న్యూఢిల్లీ : ఒడిశాలో శుక్రవారం జరిగిన ఘోర రైలు ప్రమాదానికి ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్ లో సాంకేతిక లోపమే కారణమని ప్రాథమిక విచారణలో తేలినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం వెల్లడించారు. 'ఈ అంశంపై రైల్వే భద్రతా విభాగం కమిషనర్ దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే నివేదిక వస్తుంది. అయితే, ప్రమాదానికి మూల కారణం ఏమిటో గుర్తించాం. బాధ్యులు ఎవరో కూడా గుర్తించాం. ప్రస్తుతం రైల్వే పట్టాల పునరుద్ధరణపై దష్టిపెడుతున్నాం' అని ఎఎన్ఐ వార్తా సంస్థతో ఆయన చెప్పారు. దీంతో అసలు ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ అంటే ఏమిటి? దీని వల్ల ప్రమాదం ఎలా జరిగింది? అన్న ప్రశ్నలు వినిపించాయి. రైల్వే రంగ నిపుణుల ప్రకారం..ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలో అత్యంత కీలకపాత్ర పోషించే సాంకేతిక అంశాల్లో ఒకటి.

- రైళ్లు ఒకదానితో మరొకటి ఢీకొట్టుకోకుండా సురక్షితంగా వెళ్లేందుకు ఇది తోడ్పడుతుంది.
- ఒకేసారి రెండు లేదా అంతకంటే ఎక్కువ రైళ్లకు ఒకే పట్టాలపై వెళ్లకుండా ఇది చూస్తుంది.
- ఒక రైలు సిగ్నల్ మరో రైలు సిగ్నల్‌తో విభేదించకుండా ఆ మార్గంలోని అన్ని రైళ్లూ సమన్వయంతో ముందుకు వెళ్లేలా ఇది చూస్తుంది. ఆ రైలు మార్గం సురక్షితంగా ఉందని లేదా ఆ మార్గంపై వేరే ఏ రైలూ లేదని నిర్ధారించుకున్న తర్వాతే ఇది సిగ్నల్ ఇస్తుంది.
- ఇఐ టెక్నాలజీతో రైళ్లు ఒకదానితో మరొకటి ఢీకొట్టుకోవడం వంటి ఘటనలే కాకుండా ఇతర రైలు ప్రమాదాలను కూడా చాలావరకు తగ్గుతాయి. మొత్తంగా రైల్వే ఆపరేషన్లలో భద్రత కూడా పెరుగుతుంది.


ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థ పని చేసేదిలా..!

ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్‌లో ఎలక్ట్రానిక్ కంట్రోల్ సిస్టమ్స్, కంప్యూటర్స్ ఉంటాయి. ఇవి నిత్యం రైళ్ల కదలికలను ఒక కంట కనిపెడుతుంటాయి. ఒకప్పుడు రైళ్లు సమన్వయంతో ముందుకు వెళ్లేలా చూసేందుకు సిబ్బందే నేరుగా రాడ్లు, లివర్లతో పనిచేసేవారు. ఒక రైలును దారి మళ్లించేందుకు ఈ రాడ్లను, లివర్లను చేతులతో నొక్కేవారు. అయితే, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్‌లో చాలావరకు నిర్ణయాలన్నీ సాఫ్ట్‌వేర్‌పైనే జరుగుతాయి. దీని కోసం సెన్సర్లు, ఫీడ్‌బ్యాక్ డివైజ్‌లను వాడతారు. ఫలితంగా నిర్దేశిత సమయంలో రైలు ఎక్కడుందో పక్కాగా తెలుసుకోవచ్చు. సిగ్నల్, ట్రాక్ సర్క్యూట్‌లు, ఇతర డేటా పాయింట్ల నుంచి కూడా ఈ సిస్టమ్‌కు సమాచారం అందుతుంది.

ఈ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌లో సమస్య తలెత్తడం వల్లే ప్రమాదం జరిగినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. అయితే, ఈ టెక్నాలజీలో ఏ విభాగంలో సమస్య తలెత్తిందో తెలియాల్సి ఉంది.

ఇవి కూడా కీలకమే

ఇంటర్ లాకింగ్ వ్యవస్థతతో పాటు యాక్సెల్ కౌంటర్స్, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థలను కూడా రైల్వే శాఖ ఉపయోగిస్తుంది. యాక్సెల్ కౌంటర్స్ (ఎసి) టెక్నాలజీ ప్రత్యేక ఎలక్ట్రానిక్ పరికరాల ఆధారంగా పనిచేస్తుంది. పట్టాలపై ఏదైనా ట్రైన్ ఉందా లేదా అని తెలుసుకోవడానికి దీన్ని ఉపయోగిస్తుంటారు. ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఎబిసి) టెక్నాలజీ పట్టాలను భిన్న బ్లాక్‌లుగా విడగొడుతుంది. ఇక్కడ ఒక బ్లాకులో ఒక రైలు మాత్రమే ఉండాలి. దీనికి అనుగుణంగానే సిగ్నిల్స్‌ను ఇస్తుంటారు. మానవ తప్పిదాలను, మానవ ప్రమేయాన్ని వీలైనంత తక్కువగా ఉండేలా చూసేందుకు ఈ టెక్నాలజీలు పనిచేస్తాయి.



దాడికి గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సుభాషిణి అలీ

రెండు నెలలైనా దక్కని పరిహారం

- న్యాయం కోసం 'నవమి' బాధితుల ఎదురుచూపు
- బీహార్ షరీఫ్‌లో సిపిఎం బృందం పర్యటన
- బాధిత కుటుంబాలకు పరామర్శ

పాట్నా/న్యూఢిల్లీ : బీహార్‌లోని నలందా జిల్లా కేంద్రమైన బీహార్ షరీఫ‌లో ఈ ఏడాది ఏప్రిల్ 1న శ్రీరామనవమి వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న దాడుల్లో బాధితులైనవారికి ఇప్పటికీ పరిహారం అందలేదు. ముస్లిం మైనార్టీలపైనా, చారిత్రాత్మక మదర్సా అజీజియాపైనా దాడులు జరిగాయి. నాటి దాడిలో 17 ఏళ్ల గుల్షన్ కుమార్ చనిపోయారు. 110 ఏళ్ల చరిత్ర కలిగిన మదర్సా అజీజియాలో 4000కు పైగా పుస్తకాలను తగులబెట్టారు. ఇతర మసీదులపైనా, స్థానిక సోఫ్రూ కళాశాలపైనా ఇదే రీతిలో దాడులు జరిగాయి. మైనార్టీలకు చెందిన దుకాణాలు, హోటళ్లు, ఆసుపత్రులపైనా సంఘ్ పరివార్ గూండాలు దాడులకు పాల్పడ్డారు. కానీ అక్కడి ప్రభుత్వం వీరిని ఏమాత్రం నిలువరించలేకపోయింది. దాడులు జరిగి రెండు నెలలు పూర్తయినా బాధితులకు ఇప్పటికీ ఎటువంటి పరిహారం కూడా అందలేదు. న్యాయం కోసం వారు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణీ అలీ నేతృత్వంలోని బృందం బాధిత కుటుంబాలను పరామర్శించింది. సిపిఎం తరుపున అన్నివిధాలా అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తగిన పరిహారం అందజేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. బాధితులను కలిసిన సిపిఎం బృందంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అరుణ్ మిశ్రా, అహ్మద్ అలీ తదితరులున్నారు.

మణిపూర్ హింసాకాండపై త్రిసభ్య కమిషన్


- ఛైర్‌పర్సన్‌గా జస్టిస్ అజయ్ లంబా

న్యూఢిల్లీ : మణిపూర్‌లో గత మే నెల 3 నుంచి చోటుచేసుకున్న హింసాకాండ ఘటనలపై విచారణ జరిపేందుకు గౌహతి హైకోర్టు రిటైర్డ్ ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అజయ్ లంబా ఛైర్‌పర్సన్‌గా త్రిసభ్య కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదివారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఐఎఎస్ అధికారి హిమాంశు శేఖర్ దాస్ (1982 బ్యాచ్), మాజీ ఐపిఎస్ అధికారి అలోక ప్రభాకర్ (1986 బ్యాచ్) ఈ కమిషన్‌లో మిగిలిన ఇద్దరు సభ్యులుగా ఉంటారని పేర్కొంది. ఇంఫాల్ ప్రధానకార్యాలయంగా పని చేసే ఈ కమిషన్ 6 నెలల్లోగా తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సివుంటుందని తెలిపింది. అలాగే కమిషన్ విచారణ చేపట్టాల్సిన అంశాలను కూడా కేంద్ర హోంశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. దాని ప్రకారం.. మే 3, 2023న, ఆ తర్వాత వివిధ సామాజిక తరగతులకు చెందిన ప్రజలను లక్ష్యంగా చేసుకొని జరిగిన ఘర్షణలు, హింసాత్మక చర్యలకు కారణాలేమిటనేదానిపై కమిషన్ విచారించాలి. హింసకాండకు దారితీసిన వరుస పరిణామాలు, హింసకు సంబంధించిన అన్ని వాస్తవాలను నివేదించాలి. అధికృత స్థానాల్లో ఉన్నవారు, వ్యక్తులు తాము నిర్వహించాల్సిన బాధ్యతల్లో ఏమైనా వైఫల్యాలున్నాయా? లోపాలున్నాయా? అనేది నిర్ధారించాలి. హింసను, ఘర్షణలను నివారించడానికి ప్రభుత్వ యంత్రాంగం తీసుకొన్న చర్యలేమిటనేది కూడా పరిశీలించి..ఆ చర్యలేమిటో పేర్కొనాలి. అలాగే ఈ హింసాకాండకు, ఘర్షణలకు సంబంధించి సాధారణ ప్రజానీకం, వివిధ పౌర సమాజ సంఘాల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపట్టాలి. ఈ కమిషన్ మొదట సమావేశమైన తేదీ నుంచి 6 నెలల లోగా తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి. కమిషన్ అవసరమని భావిస్తే కాలానుగుణంగా మధ్యంతర నివేదికలను కూడా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించవచ్చునని కేంద్ర హోంశాఖ తెలిపింది.

కాగ్ అక్షింతలు వేసినా..మారని మోడీ సర్కారు

- లోపాలను ఎత్తిచూపినా పట్టించుకోలేదు
- ట్రాక్‌ల నిర్వహణ, బడ్జెట్ కేటాయింపులు, వ్యయం, పోస్టుల ఖాళీలపై తీవ్ర నిర్లక్ష్యం

ప్రమాదం జరిగిన బహనగ స్టేషన్ వద్ద ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు



న్యూఢిల్లీ : ఒడిశా రైలు ప్రమాద ఘటన దేశాన్ని తీవ్రంగా కలచి వేసింది. ప్రపంచ దేశాధినేతల నుంచి సైతం విచారం వ్యక్తమైంది. అయితే ఈ ప్రమాదం విషయంలో మోడీ సర్కారు తీరు విమర్శల పాలవుతున్నది. రైల్వేలలో కనీస అవసరాలకు ప్రాధాన్యతనివ్వకుండా, సాధారణ ప్రయాణికుడిని విస్మరిస్తూ కేవలం వందే భారత్, బుల్లెట రైళ్ల పైనే శ్రద్ధ కనబర్చటంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రైలు ప్రమాద ఘటన జరిగిన తర్వాత రైల్వేల పనితీరును మెరుగుపర్చడానికి ప్రభుత్వం చేసిన అన్ని వివరాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే, ప్రభుత్వ వాదనలు దాని స్వంత ఆడిటర్ అయిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) గతేడాది నివేదికలో చెప్పిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. రైలు భద్రతపై కాగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాక్‌ల పునరుద్ధరణకు నిధుల కేటాయింపు తగ్గిందనీ, కేటాయించిన నిధులును కూడా పూర్తిగా వినియోగించడం లేదని పేర్కొన్నది. ఒడిశా ఘోర రైలు ప్రమాద నేపథ్యంలో గతేడాది కాగ్ నివేదిక ప్రస్తుతం చర్చనీయంగా మారింది.

రైల్వే ఆధునీకరణ, భద్రత విషయంలో ప్రభుత్వం చాలా కృషి చేసిందన్న ప్రభుత్వ వాదనను బలపరిచేందుకు పీఎంఓ వర్గాలు శనివారం సమాచారాన్ని పంచుకున్నాయి. విపత్తుకు బాధ్యులైన వారికి "కఠినమైన శిక్ష" విధించబడుతుందని ప్రధాని మోడీ స్వయంగా ప్రకటనా చేశారు. అయితే ఈ ప్రకటన.. రైల్వేలు లేదా తన ప్రభుత్వ ఆర్థిక నిర్ణయాలతో తలెత్తిన వ్యవస్థాగత సమస్యల కంటే వ్యక్తిగత చర్యల ఫలితంగా ప్రమాదం జరిగిందని ప్రజలకు చెప్పే యత్నమని విశ్లేషకులు భావిస్తున్నారు.

గతేడాది కాగ్ నిర్వహించిన రైల్వే పనితీరు ఆడిట్, తర్వాత అందించిన నివేదిక.. ప్రభుత్వ వాదనలకు పూర్తి భిన్నంగా ఉన్నది. 2017-2021 మధ్య జరిగిన రైల్వే ప్రమాదాలపై కాగ్ విశ్లేషణ ప్రకారం.. ఈ కాలంలో మొత్తం 2017 ప్రమాదాలు జరిగాయి. అందులో పట్టాలు తప్పినవి 1392 ప్రమాదాలు(69 శాతం). అంటే పట్టాలు తప్పి ఢీ కొనటం వంటి రైల్వే ప్రమాదాలే అధికంగా ఉండటం గమనార్హం. అయితే ఈ ప్రమాదాలకు కారణం 'మానవ తప్పిదం' అని నిందించటం ఏండ్లుగా ఒక సాధారణ ధోరణిగా మారిందనీ, అయితే కాగ్ నివేదిక ప్రభుత్వ వాదనలు తప్పని నిరూపిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

భారత రైల్వే అనేకానేక ఖాళీలతో, నామ మాత్రపు అవుట్‌సోర్సింగ్‌తో కార్యకలాపాలను నిర్వహించిందని కాగ్ వెల్లడించింది.

2017-18లో ప్రవేశపెట్టిన రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్(ఆర్ఆర్ఎస్‌కె) ప్రసిద్ధి చెందిన రైల్వే భద్రతా నిధి గురించి కాగ్ ఉటంకించింది. 1127 పట్టాలు తప్పగా.. 289 (26 శాతం) మాత్రమే పునరుద్ధరణ పనులకు నోచుకున్నాయని వివరించింది. ఆర్ఆర్ఎస్‌కె నుంచి ప్రాధాన్యత-1 పనులపై మొత్తం వ్యయం 2017-18లో 81.55 శాతం నుంచి 2019-20లో 73.76 శాతానికి తగ్గుదల ధోరణిని చూపించిందని పేర్కొన్నది. ట్రాక్ పునరుద్ధరణ పనులకు 2018-19లో నిధుల కేటాయింపు రూ.9607.65 కోట్ల నుంచి 2019-20లో రూ.7417 కోట్లకు తగ్గింది అని కాగ్ వివరించింది. ముఖ్యంగా ప్రాధాన్యత లేని ప్రాంతాలకు నిధుల వినియోగం అనేక మండలాల్లో 25 శాతం వరకు పెరిగిందని నివేదిక పేర్కొన్నది. అత్యంత రద్దీగా ఉండే పశ్చిమ రైల్వే కోసం 2019-20లో మొత్తం వ్యయంలో ట్రాక్ పునరుద్ధరణ కోసం ఖర్చు చేసినది 3.01 శాతమే కావటం గమనార్హం. భద్రతకు సంబంధించిన పనులకు ఆర్థిక సాయం అందించటానికి ప్రత్యేక నిధిని సృష్టించే ఏకైక ఉద్దేశ్యం విజయం సాధించలేకపోయిందని కాగ్ పేర్కొన్నది. పట్టాలు తప్పడానికి ప్రధాన కారణం ట్రాక్ నిర్వహణ అని వివరించింది.

భద్రతపై రైల్వే శాఖ అలసత్వం

పార్లమెంటరీ ప్యానెల్ నివేదిక

న్యూఢిల్లీ : రైల్వే భద్రత విషయంలో మంత్రిత్వ శాఖ అలసత్వాన్ని పార్లమెటరీ ప్యానెల్ ఎత్తి చూపింది. రైల్వే భద్రతకు సంబంధించిన నివేదికలను విస్మరిస్తున్నారని వివరించింది. ఈ ఏడాది మార్చిలో రైల్వే భద్రతపై సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ ప్యానెల్ ఈ విషయాలను వివరించింది. కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) చేసిన సిఫారసులు రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అత్యంత ప్రాముఖ్యతను పొందవల్సి ఉన్నప్పటికీ అది వాస్తవానికి భిన్నంగా ఉన్నదనీ, తక్కువ శ్రద్ధను కలిగి ఉన్నదని పేర్కొన్నది. రైలు ప్రమాదాలు పునరావృతం కాకుండా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ఏటీఆర్‌లను సమర్పించడానికి కాలపరిమితిని నిర్ణయించాలని ప్యానెల్ ఆ నివేదికలో సిఫారసు చేసింది.



బాలసోర్‌లో ఏర్పాటు చేసిన మృతులు, క్షతగాత్రుల ఫొటో ప్రదర్శనలో తమ వారి ఆచూకీ కోసం అన్వేషిస్తున్న బాధితుల బంధువులు

గుట్టలుగా.. గుర్తుపట్టని విధంగా

మార్చురీల వద్దే భారీగా మృతదేహాలు

భువనేశ్వర్: ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం దుర్ఘటనలో మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. మార్చురీల వద్దే భారీ సంఖ్యలో మృతదేహాలు కనిపించాయి. ఈ ప్రమాదంలో మతి చెందినవారి కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం శోకసంద్రాన్ని తలపిస్తున్నది. రైలు ప్రమాద తీవ్రతకు అనేక మృతదేహాలు ఛిద్రమైన స్థితిలో గుర్తుపట్టలేనివిగా మారాయి. దీంతో మార్చురీల వద్ద భారీగా పేరుకుపోయిన మృతదేహాలను భద్రపరచడం ఒడిశా అధికార యంత్రాంగానికి పెను సవాల్‌గా తయారైంది. గుర్తు తెలియని మృతదేహాలే భారీ సంఖ్యలో ఉండటంతో అధికారులు బాలేశ్వర్ నుంచి భువనేశ్వర్‌కు 187 మృతదేహాలను తరలించారు. అయితే, వీటిని భద్రపరిచేందుకు శవాగారాల్లో స్థలం లేకపోవడంతో సమస్యగా మారింది. దీంతో మృతుల బంధువులు గుర్తించేలా తగిన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది.

భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు 110 మృతదేహాలు తరలించగా.. మిగతా వాటిని కాపిటల్ ఆస్పత్రి, అమ్రి ఆస్పత్రి, సమ్ ఆస్పత్రి సహా పలు ప్రయివేటు ఆస్పత్రులలో భద్రపరిచారు. అయితే, ఎయిమ్స్‌లో గరిష్ఠంగా 40 మృతదేహాలను మాత్రమే ఉంచేందుకు సౌలభ్యం ఉన్నందున ఇంత భారీ సంఖ్యలో వచ్చిన శవాలను భద్రపరిచడం అత్యంత సవాల్ అని అక్కడి అధికారి ఒకరు తెలిపారు. మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు, బంధువులు గుర్తించే వరకు భద్రపరిచేందుకు శవపేటికలు, ఐస్, ఫార్మాలిన్ రసాయనాలను సేకరిస్తున్నారు.

ఆయా వెబ్‌సైట్‌లలో మృతుల ఫొటోలు, వివరాలు : ఒడిశా సీఎస్

మృతదేహాలను బంధువులు, కుటుంబ సభ్యులు గుర్తించేందుకు సులభంగా ఉండేలా మృతుల వివరాలు, ఫొటోలను ఆయా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచుతామని ఒడిశా సీఎస్ ప్రదీప్ జెనా తెలిపారు. ఫొటోలు చూడటానికి ఇబ్బందికరమైన రీతిలో ఉన్నప్పటికీ ప్రమాదం తీవ్రత, ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటిని గుర్తించడం కోసమే పోస్ట్ చేస్తున్నామన్నారు. అయితే, ఒడిశా స్పెషల్ రిలీఫ్ కమిషనర్ రాతపూర్వక అనుమతి లేకుండా ఎవరూ ఈ ఫొటోలను ప్రచురించడానికి వీల్లేదని ఉన్నతాధికారులు చెప్పారు. భువనేశ్వర్‌లోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని సంప్రదించి మతదేహాల సమాచారం పొందొచ్చని సూచించారు.

బిజెపి తుడిచిపెట్టుకుపోతుంది !

- తెలంగాణలోనూ కర్ణాటక ఫలితాలే
- ఎన్నికల తర్వాత కాషాయ పార్టీని గుర్తించడమే కష్టం
- కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ



అమెరికాలోని రూస్‌వెల్ట్ హౌస్‌లో జరిగిన కార్య క్రమంలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

.న్యూయార్క్ : దేశంలో రానున్న అన్ని ఎన్నికల్లోనూ బిజెపి తుడిచిపెట్టుకుపోతుందని, విద్వేష రాజకీయాలను ప్రజలు ఇక ఏమాత్రం సహించబోరని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తమ పార్టీ ఇతర రాష్ట్రాల్లోనూ ఆ పరంపరను కొనసాగిస్తుందన్నారు. తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లోనూ బిజెపి తుడిచిపెట్టుకుపోతుందని చెప్పారు. కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదని.. యావత్ దేశం విద్వేషపూరిత సిద్ధాంతాలను ఓడించేందుకు సిద్ధమైందని బిజెపిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

'బిజెపిని తుడిచిపెట్టేయగలమని కర్ణాటకలో నిరూపించాం. మేం వారిని కేవలం ఓడించలేదు. తుడిచిపెట్టేశాం. రానున్న అన్ని ఎన్నికల్లోనూ బిజెపి తుడిచిపెట్టుకుపోతుంది' అని న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్- యూఎస్ఎ నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ అన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన న్యూయార్క్, వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కోలో కార్యక్రమాలను ముగించుకొని మాన్‌హాటన్ చేరుకోనున్నారు.

కర్ణాటకలో బిజెపి అన్ని శక్తులను ఒడ్డినా విజయం సాధించలేకపోయిందన్నారు. అక్కడి ప్రజానీకం బిజెపిని తిప్పికొట్టారని, తెలంగాణలోనూ అదే జరగబోతోందని రాహుల్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల తర్వాత తెలంగాణలో బిజెపి నామరూపాలుండవని..గుర్తించడం కష్టమని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. అలాగే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోనూ బిజెపి కనుమరుగు అవుతుందని ఆయన చెప్పారు. బిజెపి చేస్తున్న విద్వేష రాజకీయాలతో ముందుకెళ్లలేమని దేశ ప్రజలు గుర్తించడమే అందుకు కారణమన్నారు. 2024 ఎన్నికల్లోనూ బిజెపికి ఓటమి ఖాయమన్నారు. ఈ దిశగా ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయన్నారు. అన్ని పార్టీలు కలిసి పనిచేస్తున్నాయన్నారు.

హైతీని వణికిస్తున్న కలరా

- 704 మంది మృత్యువాత

పోర్ట్ అవు ప్రిన్స్ : గతేడాది అక్టోబరులో హైతిలో కలరా పెచ్చరిల్లి 704మంది చనిపోయారని ఆ దేవ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఇందుకు సంబంధించి అధికారిక బ్యాలన్స్‌షీట్‌ను ప్రచురించారు. కలరా సంభవించినప్పటి నుండి మొత్తంగా 40,139మంది ఆస్పత్రిలో (నమోదైనవి 2,835 కేసులు) చేరాల్సి వచ్చిందని, యుక్త వయస్సు పిల్లలు కూడా దీని బారిన పడ్డారని తెలిపింది. ప్రధానంగా ఏడాది నుండి 9ఏళ్ళ వయస్సు వారు ఈ వ్యాధి బారిన ఎక్కువగా పడ్డారని పేర్కొంది. పిల్లలకు సంబంధించే 14,673 కేసులు నమోదయ్యాయని తెలిపింది. కలరా అంటే అపరిశుభ్రమైన ఆహారం లేదా కలుషితమైన నీరు తాగడం వల్ల తీవ్ర స్థాయిలో తలెత్తే డయేరియా వ్యాధే. అంతర్జాతీయ ప్రజారోగ్యానికి ఇదొక ముప్పుగా నిలుస్తోంది. అసమానతలకు, సామాజికాభివృద్ధి కొరవడడానికి ఇదొక సూచీగా వుంది. సులభంగానే చికిత్సనందించగల వ్యాధి అయినా ఇది పెద్ద ఎత్తున సంభవిస్తే ప్రాణానికి ముప్పుగానే వుంది. అంతర్జాతీయంగా క్షుద్బాధ పీడిత ప్రాంతాలుగా సూడాన్, సాహెల్‌తో పాటూ హైతీని కూడా ఐక్యరాజ్య సమితి గుర్తించింది.



తైవాన్ జలసంధిలో అమెరికా నౌకల సంచారం

తైవాన్‌లో జోక్యాన్ని సహించం

అమెరికాను హెచ్చరించిన చైనా

బీజింగ్ : తైవాన్ చైనాలో అంతర్భాగమని, ఈవిషయంలో బయటి జోక్యాన్ని సహించేది లేదని చైనా మరోసారి స్పష్టం చేసింది. జలసంధిలో అమెరికా, కెనడా సంయుక్త విన్యాసాలపై చైనా తీవ్రంగా స్పందించింది. ఈప్రాంతంలో అమెరికా యుద్ధ నౌకల సంచారాన్ని కవ్వింపు చర్యగా పరిగణించాల్సి వస్తుందని చైనా హెచ్చరించింది. అమెరికా, కెనడా నౌకలు సంయుక్త విన్యాసాలు నిర్వహిస్తున్నదారిలో తమ యుద్ధ నౌక వెళితే తప్పేంటని చైనా విదేశాంగ మంత్రి అన్నారు. తమ జల మార్గంలోకి అక్రమ చొరబాట్లు జరిగితే చూస్తూ ఊరుకోవాలా అని ఆయన ప్రశ్నించారు. ఆదివారం సింగపూర్‌లో షాంగ్రి-లా డైలాగ్ సదస్సులో అంతర్జాతీయ రక్షణాధికారుల సమావేశంలో పిఎల్ఎ జనరల్ లీ షాంగ్ఫూ మాట్లాడుతూ, తైవాన్‌పై చైనా వైఖరిని స్పష్టం చేశారు. తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదన్నారు. మార్చిలో లీ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటగా అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనడం ఇదే. శాంతి భద్రతలకు భంగం కలగని రీతిలో జరిగే 'ఇన్నోసెంట్ పాసేజ్ 'ల గురించి చైనా ఆందోళన చెందదని, కానీ నౌకల రాకపోకలపై ఆధిపత్యాన్ని చెలాయించాలని చూస్తే దానిని చైనా కచ్చితంగా తిప్పికొడుతుందని చెప్పారు. అమెరికాకు చెందిన యుద్ధనౌక యుఎస్ఎస్ చుంగ్-హూన్, కెనడా యుద్ధ నౌకలు శనివారం సంయుక్తంగా విన్యాసాలు నిర్వహిస్తున్న సమయంలో చైనా యుద్ధనౌక వాటికి అత్యంత సమీపంగా 150గజాల దూరం వరకు వెళ్లింది.. సింగపూర్ సమావేశంలో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ మాట్లాడుతూ, ఇటువంటి బెదిరింపులకు అమెరికా భయపడదని అన్నారు. తైవాన్ జలసంధిలో, దక్షిణ చైనా సముద్రంలో తమ ఉనికిని కొనసాగిస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగితే అందుకు బాధ్యులు అమెరికా దాని మిత్రపక్షాలేనని చైనా జనరల్ లీ స్పష్టం చేశారు.

సామాజిక భద్రత కన్నా మిలటరీనే మిన్న !

- అమెరికా సహా పశ్చిమ దేశాల్లో వ్యక్తమవుతున్న తీరు

వాషింగ్టన్ : మిలటరీని మినహాయించి మిగిలిన ప్రతి ఒక్క రంగంపై పెట్టే ఖర్చుల్లో కోత విధించాలన్నది పశ్చిమ దేశాల వ్యాప్తంగా కనిపిస్తున్న ఉమ్మడి అంశంగా వుంది. బడ్జెట్ ప్రాధాన్యతలపై అమెరికాలో డెమొక్రాట్, రిపబ్లికన్ నేతలపై మధ్య కుదిరిన 'రాజీ' కేవలం అమెరికాకు మాత్రమే పరిమితమైన అంశం కాదు, దాదాపు పశ్చిమ దేశాలన్నింటిలోనూ ఈ ప్రభావం కనిపిస్తూనే వుంటుంది. ప్రజా కార్యక్రమాలపై పెట్టే వ్యయంలో ఎలాంటి మార్పులు లేకపోగా, ప్రపంచంలోనే అతిపెద్దదైన మిలటరీ బడ్జెట్ విషయానికి వస్తే అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతూనే వుంది. అమెరికాలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు – ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు మెజారిటీ వుండగా, సెనెట్‌లో డెమొక్రాట్లకు మెజారిటీ వుంది, పైగా అధ్యక్షుడు డెమొక్రాట్ – దృష్ట్యా బడ్జెట్ ప్రాధాన్యతల క్రమం పెద్ద మొత్తంలో బేరసారాల ప్రక్రియతో నిండిపోయింది. ఇరు పక్షాలు తమదే విజయం అని ప్రకటించుకున్నా ఈ ఒప్పందాన్ని ఆమోదించేలా తమ సభ్యులను ముందుగా ఒప్పించుకోవాల్సి వుంది. వాతావరణ ఒప్పందం, సామాజిక వ్యయ పథకాలు ఇవన్నీ చెక్కు చెదరలేదని జో బైడెన్ చెబుతున్నారు, కానీ అది నిజం కాదు, పని చేసేందుకు వయోపరిమితిని పెంచడం ద్వారా సామాజిక భద్రతను రిపబ్లికన్లు బలహీనపరిచారు. అలాగే, శిలాజ ఇంధనాల ప్రాజెక్టులతో సహా కొత్త ఇంధన ప్రాజెక్టులను ఆమోదించే క్రమాన్ని వారు క్రమబద్ధీకరించారు. ఇందుకోసం పర్యావరణ ప్రభావ అంచనాలను పణంగా పెట్టారు. అయితే ప్రతి ఒక్క రంగంపై పెట్టే వ్యయంలో కోత పడుతుంది. మిలటరీ వ్యయాన్ని మాత్రం భారీగా పెంచుకుంటూపోతోంది. అమెరికా మిలిటరీ వ్యయం ప్రపంచ మిలటరీ వ్యయంలో 40శాతం దాకా వుంది. అయినా దాన్ని ఇంకా పెంచాలని రాజకీయ నేతలు పట్టుబడుతున్నారు. ఇందుకు వారు చైనా ను బూచిగా చూపుతుంటారు. ఇతరరంగాలపై ఎన్ని కోతలు పెట్టినా, మిలటరీపై వ్యయంలో మాత్రం కోతలు పెట్టకూడదని అటు రిపబ్లికన్లు, ఇటు డెమొక్రాట్లు కలసికట్టుగా వాదిస్తారు. దాదాపు పశ్చిమ దేశాలన్నింటిలో ఇదే తీరు. సామాజిక పథకాలపై పెట్టే ఖర్చు కన్నా మిలటరీపై పెట్టే వ్యయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నది ప్రతి ఒక్క పశ్చిమ దేశ ప్రభుత్వ ఎంపికగా వుంది. ఫ్రాన్స్, బ్రిటన్, ఇవన్నీ ఆ కోవలోకే వస్తాయి.



సందడి

పల్లవి పాట పాడగా
బాబీ బొమ్మలు వేయగా
నాజియ నాట్యం చేయగా
ఆదర్శ్ ఆటలు ఆడగా....
మా తరగతిలో
నో బ్యాగ్ డే రోజంతా
సందడే సందడి!



- హఫ్సా,
4వతరగతి,
ఎంపిపి పాఠశాల,
మర్తాడు
అనంతపురం జిల్లా.

ఫ్యాషన్



చంద్రశేఖర్,
5వతరగతి,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
గార్లదిన్న మండలం,
అనంతపురం జిల్లా.



- జాస్మిన్,
2వతరగతి,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
మర్తాడు మెయిన్, గార్లదిన్న మండలం,
అనంతపురం జిల్లా.

పండగలా వార్షికోత్సవం



హాయ్ ఫ్రెండ్స్,

ప్రతి సంవత్సరం మా పాఠశాల్లో వార్షికోత్సవం జరుపుకుంటాం. అయితే వారం రోజుల నుంచే స్కూల్లో పండగ వాతావరణం నెలకొంటుంది. ఆటల పోటీలు నిర్వహిస్తారు. అందరూ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతారు. డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తాం. ముందు రోజు పాఠశాల గదులను శుభ్రపరిచి రంగు కాగితాలతో అలంకరిస్తాం. సరస్వతి పూజ చేస్తాము. వార్షికోత్సవం రోజు జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్క విద్యార్థి పాల్గొంటారు. అదే మా పాఠశాల ప్రత్యేకత. మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల సుబ్రహ్మణ్యం సార్ మంచి ఉపన్యాసం ఇస్తారు. పిల్లలు పాటలు పాడి, డాన్స్‌లు చేస్తాం. ఏక పాత్రాభినయం, నాటికలు ప్రదర్శిస్తాం. ఫ్యాన్సీ డ్రెస్ వేసి ఫ్యాషన్‌గా నడుస్తాం. భలే సందడిగా ఉంటదిలే. కొందరు కథలు చెపుతారు. మరి కొందరు పద్యాలు చెపుతారు. అభినయ గేయాలు పాడుకుంటాం. కొందరు దేశ నాయకుల వేషధారణ వేస్తారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుంటాం. చివరిగా పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు ఇస్తారు. ఆ రోజు స్కూల్లో ఓ పండగలా ఉంటుంది.



- గిరితిక,
4వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.

బొమ్మరిల్లు



- అరుణ్ కుమార్,
4వతరగతి,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
మర్తాడు మెయిన్,
గార్లదిన్న మండలం,
అనంతపురం జిల్లా.







- బి. మహదేవ్,
4వతరగతి,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
మర్తాడు మెయిన్,
గార్లదిన్న మండలం,
అనంతపురం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీకోసం



పాలు తోడు పెట్టేటప్పుడు పెరుగుతో పాటు చిటికెడు పంచదార వేయండి. పెరుగు త్వరగా పులుపెక్కదు. రుచిగా కూడా ఉంటుంది.

జీవన సౌరభం

ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం విజయవంతుల ప్రాథమిక లక్షణం.

ఆటంకాలను దాటి .. పది పాసయ్యారు!

ఒకపక్క ఆడపిల్లలు ప్రపంచస్థాయిలో ముందుకు దూసుకుపోతున్నా... మరోవైపు కనీసం పదో తరగతి చదవడం కూడా కష్టమవుతోంది. అటువంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని తాము ఈ ఏడాది పది పాసయ్యామని చెబుతున్నారు నలుగురు గిరిజన ఆడపిల్లలు.



బెంగాల్‌లో బీర్భూమ్‌లో బోల్‌పూర్ దగ్గర సాహెబ్దం గ్రామంలో కొన్ని గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారి నివాస ప్రాంతాలు పట్టణాలకు చాలా దూరం. పెద్దలతో పాటు పిల్లలు కూడా ఉపాధి కోసం కూలికి పోతారు. అందరూ కష్టపడితే నాలుగు వేళ్లు నోట్లోకి వెళతాయి. అక్కడ వారంతా ఎక్కువగా ఓ పూట గంజి తాగి, మరో పూట అన్నం తింటారు. ఇంత పేదరికంలో అక్కడ పిల్లలు చదువుకోవడం అంటే చాలా కష్టం.

ప్రాథమిక పాఠశాల అందుబాట్లో ఉంటుంది కాబట్టి ఆడపిల్లలు, మగపిల్లలు వెళతారు. కానీ, హైస్కూలుకు వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడవాలి. ఇంటికి వచ్చేసరికి చీకటి పడుతుంది. దీంతో, ఆడపిల్లల చదువు అక్కడితో ఆగిపోయేది. దూరంగా ఉన్న స్కూలికి పంపటం ఎందుకని ఆడపిల్లలను పంపేవారు కాదు తల్లిదండ్రులు.


ఇలాంటి పరిస్థితిని అధిగమించి, పుస్తకాల సంచితో ఊరి పొలిమేర దాటారు నలుగురు ఆడపిల్లలు. వారి పేర్లు : బసంతి, లతికా, మీరూ, సుమిత్ర. ఈ సంవత్సరం పదో తరగతి చదివారు. అందుకు ఎంతో కష్టపడ్డారు. వీరు నలుగురూ చిన్నతనంలోనే ఓ ప్రమాదంలో తండ్రులను కోల్పోయారు. తల్లులు తెచ్చే కూలి డబ్బులతోనే ఇల్లు గడిచేది. సెలవు రోజుల్లో ఈ ఆడపిల్లలు కూడా తమ తల్లులతో కలిసి కూలి పనులకు వెళ్లేవారు. పదో తరగతిలో చదువుతున్నప్పుడు కూడా మధ్యలో కూలి పనులకు వెళ్లారు. వీరిలో ముగ్గురు స్కూలుకు వెళితే, నాలుగో అమ్మాయి పనికి వెళ్లేది. ఇంటికి వచ్చి స్నేహితుల దగ్గర పుస్తకాలు తీసుకుని ఆ రోజు చెప్పిన పాఠాలను రాసుకునేది. ఓ వైపు పనిచేసి అలిసిపోయి నిద్రవస్తున్నా... పాసవ్వాలన్న పట్టుదలతో చదివారు. ఒక్కోసారి స్కూలుకు నడుచుకుంటూ వెళుతున్నప్పుడు భారీ వర్షం కురిసేది. పుస్తకాలు తడవకుండా గోనుపట్టాలు కప్పేవారు. తాము తడిచినా అలాగే స్కూలుకు వెళ్లేవారు. ఇలా ఇబ్బందులు పడుతూ, కుటుంబ ఆర్థిక పరిస్థితులు సైతం ఎదుర్కొని పదో తరగతిమంచి మార్కులతో పాలయ్యారు. ఇప్పుడు ఈ నలుగురినీ గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆ గ్రామంలో పదో తరగతి చదివిన మొట్టమొదటి బాలికలు వీరే! భవిష్యత్తులో బాగా చదివి, తమ గ్రామంలో పిల్లల ఉన్నత చదువుకు కృషి చేస్తామని వారు చెబుతున్నారు.

సపోటాతో ఆరోగ్య ప్రయోజనాలు

ఈకాలంలో దొరికే పండ్లలో సపోటా ఒకటి. ఎంతో తియ్యగా ఉండే సపోటాల్లో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని వైద్యులు అంటున్నారు. నీరు శాతం కూడా ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ చెమట పట్టేవారు వీటిని తీసుకుంటే నీరసం తగ్గి శక్తి పొందుతారు. వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.



- ఎముకలను బలపరిచే కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్ కూడా సపోటాలో పుష్కలంగా ఉన్నాయి. దాంతో రక్తహీనత తగ్గుతుంది.
- సపోటాల్లో ఉన్న ఫోలేట్స్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్, కాపర్, ఫాస్ఫరస్, సెలెనియంలు ఎముకలను ధృఢంగా చేస్తాయి.
- వీటిలో ఉండే విటమిన్ ఎ, బి, ఇ చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి. విటమిన్ ఎ ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ నుంచి రక్షిస్తుంది. కంటి చూపు మెరుగుపడేలా చేస్తుంది.
- సపోటాలో డైటరీ ఫైబర్ ఉంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుది. వీటిలో సుక్రోజ్ ఎక్కువ. బరువు తాగ్గాలనుకునే వారు వీటిని తీసుకుంటే మంచిది. వీటిని తిన్న వెంటనే శరీరానికి అధికశక్తి అందుతుంది. అధిక వేడి వల్ల అలిసిపోయిన వారు సపోటా జ్యూస్ తాగితే వెంటనే శక్తి వస్తుంది.
- శరీరంలో వేడిని బయటకు పంపి, శరీర భాగాలను చల్ల బరిచే టానిన్స్ ఇందులో ఉన్నాయి. శరీరంలో విష వ్యర్థాలను బయటకు పంపుతుంది.
- సపోటాల్లోని మెగ్నీషియం రక్త నాళాల్ని చురుగ్గా చేస్తుంది. అలాగే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. రక్తం సరిగా లేని వాళ్లు సపోటాలు తినాలి. మధుమేహం ఉన్నవారు వైద్యులను సంప్రదించి తీసుకోవాలి.



కరోనా తర్వాత నుంచి చిత్ర పరిశ్రమలో సాంకేతిక మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. లాక్‌డౌన్ వల్ల ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే పరిస్థితి లేదని ఓటీటీ వేదికలు పుట్టుకొచ్చాయి. దీంతో ప్రేక్షకులు ఓటీటీలకు డబ్బులు కట్టి ఫోన్లలోనే సినిమాలను చూడటం అలవాటు పడ్డారు. దాంతో ఇప్పుడు థియేటర్లకు వచ్చి సినిమా చూసేందుకు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. గతంలో లాగా భారీ సంఖ్యలో అభిమానులు వచ్చి హంగామా చేసే పరిస్థితి లేదు. ఓటీటీ సినిమాలను తమకు వీలైన సమయంలో ఇంట్లో కూర్చొని చూస్తున్నారు. దీంతో పెద్ద సినిమాలు కూడా థియేటర్లలో విడుదలైన వారానికే ఓటీటీల్లోకి వచ్చేస్తున్నాయి.

ఇక ఇంట్లోనే ఫస్ట్ డే ఫస్ట్ షో ..!

ఈ నేపథ్యంలో ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) కొత్త విధానాన్ని ముందుకు తీసుకొచ్చింది. దీనివల్ల సినిమా విడుదలైన రోజునే మొదటి ఆటను ఇంట్లోనే చూడొచ్చు. ఈ విధానం వల్ల చిన్న-పెద్ద సినిమా అని తేడా లేకుండా విడుదలైన రోజే ప్రేక్షకులు ఇంట్లోనే ఉండి సినిమా చూడొచ్చు అంటున్నారు. ఒకప్పుడు కొత్త సినిమా ఫస్ట్‌డే ఫస్ట్‌షో చూడాలంటే అంత ఈజీ కాదు. అదిప్పుడు అత్యంత సులభం అయ్యే రోజొచ్చింది.

ఒకప్పుడు పెద్ద సినిమా థియేటర్లలో విడుదలైతే- ఎన్ని రోజులైనా చిన్న సినిమాలకు థియేటర్లు దొరికేవి కావు. డిస్ట్రిబ్యూటర్లు కూడా ఆ సినిమాను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చేవారు కాదు. ఓటీటీలు వచ్చాక చిన్న సినిమాలు తీసే దర్శకులు, నటీనటులకు మంచి అవకాశం వచ్చినట్టే అయ్యింది. కరోనా సద్దుమణిగాక ఒక కొత్త పరిస్థితి ఏర్పడింది. చిన్న సినిమాలకు ఓటీటీలు, పెద్ద సినిమాలకు థియేటర్లు అన్న వాతావరణం నడిచింది. ఇప్పుడు ఆ పరిస్థితులు కూడా పోతున్నాయి. ఏపి స్టేట్ సాంకేతిక విభాగం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. అధికారులు ఫైబర్ నెట్ ద్వారా దేశంలోనే ప్రయోగాత్మకంగా ఒక వినూత్న విధానాన్ని అమలు చేయబోతున్నారు. దీంతో ఇంట్లోనే ఉండి కొత్త సినిమాను చూడొచ్చు. యాప్, ఆపరేటర్ ద్వారా నగదు చెల్లించి సబ్‌స్క్రిప్షన్ చేసుకున్న వారు 24 గంటల్లోగా సినిమాను చూడొచ్చు. కొత్త దర్శకులకు, చిన్న నిర్మాతలకు అవకాశం కల్పించినట్లు ఉంటుంది.

ప్రస్తుతం చిన్న సినిమాలే కొత్త కొత్త ప్రయోగాలకు, ప్రయత్నాలకు వేదికలుగా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందతున్నాయి. ఇందుకు 'బలగం' సినిమానే నిదర్శనంగా చొప్పొచ్చు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రాజా, కమలిని ముఖర్జీ హీరోహీరోయిన్లుగా నటించిన 'ఆనంద్' చిత్రం విడుదలైన వారం తర్వాత ప్రజల్లోకి వెళ్లింది. వారం కూడా ఆడదనుకున్న ఈ చిత్రం దాదాపు 130 రోజులు ఆడి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది. 'బిచ్చగాడు' విడుదలైన వారం వరకు అసలు ఈ సినిమా ఉన్న సంగతి ఎవ్వరికీ తెలియదు. అమ్మ కోసం ఒక కోటీశ్వరుడు బిచ్చగాడిగా మారిన కథను చూసిన ప్రేక్షకులు మెచ్చడంతో- అప్పుడు డిస్ట్రిబ్యూటర్స్ కొనేందుకు ముందుకు వచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రేక్షాదరణ పొందిన చిన్న చిత్రాలు ఎన్నో ఉన్నాయి. కథలో వాస్తవికత, సామాజిక అంశాలు, కొత్తదనం ఉంటే చిన్న అయినా, పెద్ద అయినా సినిమా ప్రేక్షకాదరణ పొందుతుంది.



ఇంట్లోకే నేరుగా సినిమా వచ్చే సాంకేతిక పరిజ్ఞానం వల్ల భవిష్యత్తులో పైరసీ సమస్య కూడా ఉండదు. కొంతమంది కొత్త చిత్రాలు విడుదలైనప్పుడు వాటిని థియేటర్లో షూట్ చేసి,కొన్ని యాప్స్‌లో ఉంచుతున్నారు. దాంతో చాలామంది డబ్బు చెల్లించకుండా సినిమాలు చూస్తున్నారు. ఇది నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు నష్టం కలిగిస్తుంది. వీటన్నిటికీ నూతన విధానం చెక్ పెట్టబోతుందని నిపుణులు అంటున్నారు.

పాన్ ఇండియా స్థాయిలో విడుదలయ్యే సినిమాలు కొన్నేళ్ల పాటు థియేటర్లలో కూడా వస్తాయి. అవి ఫైబర్ నెట్‌లోనూ విడుదల చేసుకోవచ్చు. ఇదే గనుక పూర్తిగా అమల్లోకి వస్తే చందాదారులకు ఇంట్లోనే కూర్చొని కొత్త సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో చూసే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితి తప్పదని విక్రమ్ సినిమా నిర్మించిన సమయంలో ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముందుగానే చెప్పారు. అయితే, అప్పట్లో చాలామంది ఆ ఆలోచనను తప్పుబట్టారు. కానీ, ఆచరణలో కమల్ మాటే ఇప్పుడు నిజమవుతోంది.

AP fiber
APSFL
Andhra Pradesh State FiberNet Ltd.

మెస్సి దారెటు?!

- పిఎస్‌జితో ముగిసిన బంధం
- ఆఖరు మ్యాచ్‌లో ఫ్యాన్స్ హేళన



లియోనల్ మెస్సి. ప్రపంచ ఫుట్‌బాల్ సూపర్ స్టార్. మైదానంలో మెస్సి మ్యాజిక్ చూసేందుకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఎదురుచూస్తారు. పారిస్ సెయింట్ జర్మెన్ (పిఎస్‌జి) క్లబ్‌తో రెండేళ్ల బంధానికి తెరదించిన లియోనల్ మెస్సి పట్ల ఆ క్లబ్ అభిమానులు అనుచితంగా ప్రవర్తించారు. శనివారం పిఎస్‌జి తరఫున ఆఖరు మ్యాచ్ ఆడిన మెస్సి దురభిమానుల ఎగతాళి చవిచూసినా.. చిరునవ్వుతో మైదానాన్ని, పిఎస్‌జినీ వీడాడు.

పారిస్ (ఫ్రాన్స్) : లియోనల్ మెస్సి (35) పారిస్ సెయింట్ జర్మెన్ (పిఎస్‌జి)తో ఒప్పందానికి తెరదించాడు. రెండేళ్ల ఫ్రెంచ్ ఫుట్‌బాల్ క్లబ్‌తో కొనసాగుతున్న లియోనల్ మెస్సి.. కాంట్రాక్టును మరో ఏడాది కొనసాగిస్తాడనే అంచనాలు కనిపించాయి. కానీ, గత రెండు నెలల్లో జరిగిన అనూహ్య సంఘటనలతో పిఎస్‌జితో లియోనల్ మెస్సి బంధానికి తెరపడింది. 35 ఏండ్ల లియోనల్ మెస్సి శనివారం ఫ్రెంచ్ లీగ్‌లో పిఎస్‌జి తరఫున ఆఖరు ఆట ఆడాడు. సొంత మైదానంలో శనివారం జరిగిన చివరి మ్యాచ్‌లో క్లర్‌మోంట్ చేతిలో 2-3తో పిఎస్‌జి పరాజయం పాలైంది. చివరి మ్యాచ్‌లో గోల్ కోసం ప్రయత్నించినా.. లియోనల్ మెస్సి గోల్ కొట్టలేకపోయాడు.

చిరునవ్వుతోనే..! : శనివారం నాటి మ్యాచ్ ముందు అనౌన్సర్ లియోనల్ మెస్సి పేరు ప్రకటించగానే పిఎస్‌జి దురభిమానులు పెద్ద ఎత్తున హేళన చేశారు. కాసేపటికి తన ముగ్గురు కుమారులతో కలిసి మైదానంలోకి అడుగుపెట్టిన లియోనల్ మెస్సి చిరునవ్వుతోనే అభిమానులను పలకరించాడు. మ్యాచ్ చివర్లో కిలియన్ ఎంబపె అందించిన పాస్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపించటంలో లియోనల్ మెస్సి తడబాటుకు గురయ్యాడు. దీంతో దురభిమానుల ఎగతాళి తారాస్థాయికి చేరుకుంది. 'పిఎస్‌జి క్లబ్, అభిమానులు, పారిస్ నగరానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పిఎస్‌జికి ఆల్ ది బెస్ట్' అని లియోనల్ మెస్సి వీడ్కోలు వ్యాఖ్యలు చేశాడు. పిఎస్‌జి తరఫున రెండు సీజన్లలో 75 మ్యాచులు ఆడిన లియోనల్ మెస్సి.. 32 గోల్స్ కొట్టాడు. 35 గోల్స్‌కు అవకాశాలు సృష్టించాడు. పిఎస్‌జి తరఫున రెండేండ్లలో రెండు ఫ్రెంచ్ లీగ్ టైటిళ్లు, ఓ ఫ్రెంచ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను మెస్సి ముద్దాడాడు. నిజానికి, ఈ ఏడాది మార్చి వరకు పిఎస్‌జి, మెస్సి బంధం బాగానే కనిపించింది. 'పిఎస్‌జిలో చాలా కంఫర్ట్‌గా ఉన్నాను. తొలి సీజన్‌లో పరిస్థితులకు అలవాటు పడేందుకు కాస్త సమయం పట్టింది. కానీ ఈ సీజన్ భిన్నంగా మొదలైంది. క్లబ్, సిటీతో ఎంతో మెరుగైన బంధం ఏర్పడింది. ఈ సీజన్‌ను చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నాను' అని మెస్సి ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68